# అవిద్య అంటే ?

రచన : బ్రహ్మవిద్యావరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి



# అవిద్య అంటే?



**రచన : బ్రహ్మావిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి**

మొదటి ముద్రణ : సెప్టెంబరు, 2025
ప్రతులు : 2,000

**వెల : రూ.70/-**

పుస్తకముల కొరకు :-

**తటవర్తి వీరరాఘవరావు,**

**తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.**

**సెల్ : 94901 71853, 9440309812**

# విషయ సూచిక :

1. అవిద్య అంటే ఏమిటి? .................................................................... 3

2. బ్రహ్మవిద్య గొప్పతనం .................................................................... 22


3. సుఖంగా, సంతోషంగా, హాయిగా జీవించాలంటే ఏం చేయాలి? ..... 32

4. సంపదలు చూసుకుని సంబరపడడం కాదు,

జ్ఞానం పొందినప్పుడు సంబరపడాలి ............................................ 35

5. ఆధ్యాత్మిక జీవితంపై ఎందుకు దృష్టి పెట్టలేకపోతున్నారు? ................ 45

6. సత్యానుభూతి కలగకపోవడానికి కారణం! .................................... 54



## ధ్యానం చేసే పద్ధతి
## శ్వాస మీద ధ్యాస



ఎవరికి తగిన సుఖాసనంలో వారు హాయిగా కూర్చుని... చేతులు రెండూ కలిపి... కళ్ళు రెండూ మూసుకుని... ప్రకృతి సహజంగా జరుగుతోన్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ వుండాలి!

మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు 'కట్' చేస్తూ... మళ్ళీ, మళ్ళీ శ్వాస మీదకే... ధ్యాస మరల్చుతూ వుంటే.. క్రమక్రమంగా... ఆలోచనా రహిత స్థితి కలుగుతుంది.... చిత్తవృత్తులు నిరోధించబడతాయి... మనస్సు నిర్విషయం, శూన్యం అయిపోతుంది. మనస్సు శాంతిస్తుంది. ఇదే ధ్యాన స్థితి.

ఈ ఆలోచనా రహిత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీ మండల, ఆత్మానుభవాలను గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో విశ్వమయ ప్రాణశక్తి. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీమండలాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శక్తి వల్ల రోగాలన్నీ తగ్గుతాయి. నాడీమండలశుద్ధి వల్ల కర్మలు పోతాయి.

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంతుంటుందో... కనీసం అన్ని నిమిషాలు... తప్పనిసరిగా... రోజుకి రెండు సార్లుగా... ధ్యానం చెయ్యాలి.

# అవిద్య అంటే ?

ఎందుకు ధ్యాన సాధన చేయాలి? జ్ఞానం పెంచుకోవాలి? అనే విషయం ఆలోచిస్తే.. ప్రతీ మానవునకు సమస్యలు, బాధలు, కష్టాలు ఎందుకు వస్తున్నాయో అర్థం చేసుకోవడానికి. ముఖ్యంగా అవిద్య, అజ్ఞానమే దానికి కారణం అని తెలుసుకోవాలి.

శంకరాచార్యుల వారు జ్ఞానం లేకపోవడం అజ్ఞానం అంటారు. అయితే అవిద్య అంటే తప్పుడు జ్ఞానం... అంటే ఒకదాన్ని వేరే విధంగా అర్థం చేసుకోవడం అన్నారు. అంటే అజ్ఞానం, అవిద్య వేరు వేరు.

అవిద్య అంటే తప్పుడు జ్ఞానం అంటే

ఎ) ఉన్నదాన్ని సరిగ్గా అవగాహన చేసుకోలేకపోవడం.

బి) అపార్థం చేసుకోవడం.

సరైన జ్ఞానాన్ని సమ్యక్ జ్ఞానము అంటారు. మరి సరియైన జ్ఞానం ఎందుకు లేదు అంటే? అవిద్య, అజ్ఞానం వల్ల. మరి దాని వల్ల మానవుడు ఎప్పుడూ దుఃఖం లోనే ఉంటున్నాడు.

అవిద్య అంటే ఏదైనా మాట్లాడితే దాని మీద సరైన అవగాహన లేనప్పుడు, అపార్థం చేసుకున్నప్పుడు దుఃఖం వస్తుంది. చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు పిల్లల క్షేమం కోరి కొన్ని విషయాలు చెప్తారు. అలా చెప్తున్నప్పుడు ఒక్కొక్కసారి నచ్చనప్పుడు మా అమ్మ ఎప్పుడూ ఇంతే, మా నాన్న ఎప్పుడూ ఇంతే, నేను అడిగినవి చేయరు, నేను అడిగినవి ఇవ్వరు అని అంటారు.

ఉదాహరణకు చిన్న పిల్లలకి చాక్లెట్లు చాలా ఇష్టం. ఒకసారి, రెండుసార్లు తింటే పర్వాలేదు కానీ అస్తమానూ చాక్లెట్లు తింటే పళ్ళు పుచ్చిపోతాయని ఆ తల్లి అస్తమానూ ఇవ్వడానికి ఇష్టపడదు. అంటే పిల్లలు క్షేమం కోరి అలా ఇవ్వకపోవడం తల్లి బాధ్యత అనుకుంటుంది.

కానీ అవగాహన లేని పిల్లలు మా అమ్మ చాక్లెట్లు తిననివ్వదు, ఎప్పుడు అడిగినా ఏదో ఒక కారణం చెప్తుంది అంటారు. అంటే సరైన అవగాహన లేక అపార్థం చేసుకుంటారు. ఇది చిన్నతనంలో జరిగే సంఘటన. అలా పెరిగే కొద్ది పిల్లలు అడిగినవి తల్లిదండ్రులు ఇవ్వకపోతే అవగాహన లేకపోవడం వల్ల వారి మీద ద్వేషం పెంచుకుంటారు. కొంతమంది ఏమీ చేయలేని స్థితిలో దుఃఖ పడుతూ ఉంటారు.

చూడండి కొంతమందికి తాహతకు మించిన కోరికలు ఉంటాయి, ఆ కోరికలు తీరనపుడు నా బ్రతుకింతే, అని అనుకుంటారే తప్పించి ఆ పరిస్థితిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించరు. దీనికి కారణం జ్ఞానం లేకపోవడమే. అలా తప్పుడు అవగాహన చేసుకుంటూ అపార్థము చేసుకుంటారు.

అదే సరైన అవగాహన ఉన్నప్పుడు దేన్నీ అపార్థము చేసుకోకుండా ఉంటారు. దానికి జ్ఞానం ఉండాలి. కానీ పుట్టిన వెంటనే ఎవ్వరూ జ్ఞానవంతులు కారు.

ఇప్పుడు భూమిమీద అందరూ అజ్ఞానంలోనే బ్రతుకుతున్నారు కానీ జ్ఞానం పొందడానికి ప్రయత్నించటం లేదు. మనం ఎంతో పుణ్యం చేసివచ్చాం కాబట్టే జ్ఞానమే జీవితానికి పరమార్థం, జ్ఞానం ఉంటేనే మన జీవిత లక్ష్యాన్ని సాధించగలము అని తెలుసుకున్నాం.

ఇదంతా మనకి ఈ జన్మలో వచ్చింది కాదండి. గత జన్మలో చేసుకున్న పుణ్యం వల్లే మనందరం ఈ ధ్యాన మార్గంలోకి రాగలిగాం. సహజంగా గురువు ఉన్నా జ్ఞానం పొందాలి అనే కోరిక చాలా తక్కువ మందికి ఉంటుంది.

ఈ తప్పుడు అవగాహన గురించి శంకరాచార్యులు, అలాగే ఆయన గురువు గోవింద పాదాచార్యుల వారు కొన్ని ఉపమానాలు చెప్పడం జరిగింది.

## ఎ) తప్పుడు అవగాహన గురించి ఐదు రకాలు చెప్తారు

**1) తాడును చూసి పాము అనుకోవడం :**

చూడండి సంధ్యవేళలో అంటే చీకటి పడేవేళలో కొంచెం వెలుగు వుంటుంది. మీ పెరట్లో నుయ్యి చట్రం మీద ఏదైనా ఒక తాడు పడి ఉంది అనుకోండి, మీరు ప్రొద్దుటి నుంచి ఆ తాడును చూడలేదు, అప్పుడే చూసారు. ఆ మసక వెలుతుర్లో దాన్ని పాము అనుకున్నారు. వెంటనే అమ్మో ఇక్కడ పాము పడుకుంది అని కంగారుపడిపోతారు.

అంటే అక్కడ మనకి సరైన అవగాహన లేదు, అందుచేత యదార్థాన్ని యదార్థంగా చూడలేకపోయారు. యదార్థంగా అది తాడు, కానీ మీ భ్రాంతి పాముగా కనిపించి భయపడ్డారు. అలా భయపడటం వల్ల సరైన సత్యం అర్థం కాలేదు.

**2) అలాగే దుంగను చూసి దెయ్యం అనుకోవడం :**

అంటే ఒక వ్యక్తి అడవిలో ప్రయాణిస్తున్నాడట, దారిలో ఒక కొట్టేసిన చెట్టు ఉంది. చీకట్లో వాడు అది మనిషి అనుకున్నాడు. మనుషులు తిరగని అడవి ప్రదేశం కాబట్టి అది ఖచ్చితంగా దెయ్యమే అయి ఉంటుంది అని భ్రాంతిలో పడి భయపడి పోయాడు.

అంటే ఇక్కడ అవిద్య వల్ల తప్పుడు అవగాహన వచ్చింది. అంటే దుంగను చూసి దెయ్యమని భ్రాంతిలో పడిపోయాడు. ఈ విధంగా సత్యం అర్థం కాలేదు.

3) అలాగే ఒక్కొక్కసారి ఆకాశం వైపు చూసినప్పుడు మేఘాలు దట్టంగా ఉన్నప్పుడు మేఘాలు కదులుతూ ఉంటాయి. కొన్ని రూపాలుగా ఏర్పడుతూ ఉంటాయి. ఒక్కొక్కసారి తప్పుడు అభిప్రాయంతో ఆ మేఘాలను చూసి ఆకాశంలో దేవతల బొమ్మలు వస్తున్నాయి, దేవతలు ప్రత్యక్షం అవుతున్నారు అనే ఒక భ్రాంతిలో పడి దణ్ణాలు పెట్టేస్తూ ఉంటారు. ఇంకేముంది

నేను దేవుళ్ళను చూసాను, నాకు కనిపించింది అంటారు. ఇది కూడా తప్పుడు అవగాహనే. ఇక్కడ లోతుల్లోకి వెళ్లి ఆలోచించరు, చూడరు.

**4) మెరిసే వస్తువుల్ని వెండిగా భ్రాంతి చెందడం.**

ఒక్కొక్కసారి సముద్రం వడ్డున నత్తగుల్లలు పడి ఉంటాయి. అవి సూర్య కిరణాలకి మెరుస్తూ ఉంటాయి. అలా మెరుస్తూ ఉన్నప్పుడు అమ్మో! ఇక్కడ వెండి ఇలా పడేశారేంటి? అనే భ్రాంతితో దగ్గరికి వెళ్లి చూస్తే అది మెరిసే వస్తువని, వెండి కాదని తెలుస్తుంది, కానీ వెండి అని భ్రాంతి పడ్డాడు.

**5) ఎండమావులు చూసి నీరు అని భ్రాంతి పడడం:**

అలాగే ఎండాకాలంలో ప్రయాణం చేస్తున్నప్పుడు దూరంగా నీరు ఉన్నట్టు కనిపిస్తుంది. కానీ దగ్గరికి వెళ్లి చూస్తే అక్కడ నీరు ఉండదు. అందుకే దాన్ని ఎండమావులు అని అంటారు. మరి ఇలా తప్పుగా అవగాహన చేసుకుంటారు. అది తప్పుడు జ్ఞానం.

చూడండి పాము అలాగే కనబడింది, మేఘాలు అలాగే కనబడ్డాయి, దుంగ అలాగే కనబడింది, మెరిసే వస్తువులు అలాగే కనిపిస్తాయి. ఎండమావులు అలాగే కనపడ్డాయి. ఇవన్నీ సత్యం కాదు అని దగ్గరికి వెళ్ళి చూశాక అది తప్పుడు అభిప్రాయం అని అర్థమవుతుంది.

ఇలాగే జీవితంలో నచ్చని వ్యక్తుల మీద కానీ, లేకపోతే దగ్గరి వాళ్ళ మీద కానీ చెడ్డ అభిప్రాయం ఏర్పరచుకుంటారు. కొంతమందికి ఎవరిని చూసినా, ఎవరితో మాట్లాడినా, చెడ్డ అభిప్రాయం ఏర్పరచుకుంటారు. దానికి గత జన్మల నుంచి వచ్చిన వాసనలే కారణం. కాని ఈ జన్మలో అవి ఖచ్చితంగా వదుల్చుకోవాలి.

ప్రారంభ దశలో ఎవరికైనా జ్ఞానం కొంచెం తక్కువగా ఉంటుంది కాబట్టి అందరిని తప్పుడు అభిప్రాయంతో చూస్తూ ఉంటారు, అపార్థాలు చేసుకుంటూ ఉంటారు. ఒక్కొక్కసారి ఆ మాటలు అర్థం కానప్పుడు వాళ్ళతో

శత్రుత్వం పెంచుకుంటారు. దానివల్ల గొడవలు పడి దుఃఖం పొందుతారు.

ఎప్పుడైనా గమనించండి “ఒక మంచి మాటే మిత్రత్వం, ఒక పరుష వాక్యమే శత్రుత్వం”. ఎవరైనా ఏదైనా చెప్తే మాకు తెలుసులే అని పరుషంగా మాట్లాడితే వాళ్ళ మనసుల్లో మీ మీద చెడ్డ అభిప్రాయం ఏర్పడుతుంది. ఇలా మాట్లాడటానికి కారణం? మీకున్న అహంకారం అవ్వచ్చు లేదా అవతల వ్యక్తుల మీద వున్న చెడ్డ అభిప్రాయం అయినా అవ్వచ్చు.

కొంతమంది ఊరికే సలహాలు ఇస్తూ ఉంటారు. అలాంటి వాళ్ళు లోకువగా కనిపిస్తారు. అలా అడగకుండా సలహాలు ఇవ్వకూడదని తెలుసుకోవాలి. ఈ సంస్కారం పోవాలి. దానికి ధ్యానము, జ్ఞానము అనేవి రెండూ ఉండాలి.

ప్రారంభ జన్మల్లో తమోగుణం, రజోగుణంలో వుంటారు. అంటే ఎక్కువ మనోస్థితిలో ఉంటారు, భయం అనేది ఉంటుంది. ఈ మనోస్థితిలో ఉన్నప్పుడు మనసుకు ప్రాధాన్యం ఇచ్చి జీవిస్తూ ఉంటారు. అంటే కొన్ని జన్మలు శరీరం కోసం, కొన్ని జన్మలు మనసు కోసం జీవిస్తారు కాబట్టి జ్ఞానం తక్కువగా ఉంటుంది.

ఎప్పుడైతే ధ్యాన సాధన మార్గంలోకి వస్తారో అప్పుడు గురువు బోధ వల్ల ఈ అవిద్య, అజ్ఞానం అనేవి మెల్లి మెల్లిగా తొలుగుతూ ఉంటాయి. ఇక్కడ అవిద్య అంటే తప్పుడు అభిప్రాయం సత్యం తెలుసుకునే వరకు ఉంటుంది.

చూడండి చీకట్లో తాడును చూసి పాము అన్నారు. ఇంతలో ఎవరో వచ్చి లైట్ వేశారు చూస్తే అది తాడు. వెంటనే నవ్వుకుంటారు.

అంటే సత్యం తెలుసుకునే వరకు తప్పుడు అభిప్రాయం పోదు.

అలాగే అడవిలో దుంగను చూసి దెయ్యం అనుకుని, కొంతమంది అటే వెళ్తుంటే నేను ఫలానా చోట దెయ్యాన్ని చూసాను అని చెప్పినప్పుడు,

అదే రూట్లో నుంచి ప్రయాణం చేసిన మరో వ్యక్తి అయ్యో అది మొన్నా కనిపించింది, నిన్న కూడా కనిపించింది, అందరికీ అది కనిపిస్తుంది. అదేం దెయ్యం కాదు, నరికిన చెట్టు అని చెప్పారనుకోండి అప్పుడు అభిప్రాయాన్ని మార్చుకుంటారు.

అలాగే మేఘాల్ని దేవతలు కనిపించారని చెప్తారు. కానీ అలా 10 నిమిషాలు మేఘం వైపు చూస్తే ఆకారం మారిపోతుంది. ఓహో ఇది దేవతా రూపం అనుకున్నాను కానీ ఇవి మేఘాలే అని అభిప్రాయాన్ని మార్చుకుంటారు.

అలాగే మెరిసే వస్తువులు వెండి అనుకున్నారు. కానీ దగ్గరికి వెళ్ళి చూస్తే అవి నత్తగుల్లలు అని తెలుస్తుంది.

మరి ఎండమావుల్ని చూసి నీరు ఉందని వెళ్ళినప్పుడు ఎంత దూరం వెళ్ళినా నీరు కనబడదు. అప్పుడు అది ఎండమావి అని తెలుసు కుంటారు.

ఈ తప్పుడు అభిప్రాయాలు ఎలా పోతాయి? అంటే సత్యం తెలుసు కున్నాకపోతాయి. మొదట మానవుడిలో పుట్టేది అవిద్య, ఆ తర్వాత అజ్ఞానం. కానీ ప్రతి విషయంలో ఇలాగే ఉండిపోతే అది సత్యానికి దూరం చేస్తూంటుంది.

ఈ ధ్యాన మార్గంలోకి వచ్చాక ఇలాంటి చిన్న చిన్న విషయాలు ఎందుకు తెలియజేస్తారంటే! ఇంకా అలాంటి వాసనలు, సంస్కారాలు మీలో ఉండి అవిద్య వైపు, అజ్ఞానం వైపు వెళ్తారేమోనని శంకరుల వారు మనకి ఎప్పుడూ గుర్తు చేస్తూ ఉంటారు.

అంటే ఈ ఐదే కాదు మన జీవితంలో ఇలాంటి తప్పుడు అభిప్రాయాల వల్ల అందరితోటి శత్రుత్వం వస్తుంది. మీరు అందరినీ అపార్థం చేసుకుంటూ.. నాకన్నీ తెలుసు, నేనే గొప్ప అనే అహంకారం పెంచుకోకూడదనే ఇలాంటి చిన్న చిన్న విషయాలు చెప్పారు. మరి అవి సరిదిద్దుకుంటే అవిద్య నాశనం జరుగుతుంది.

అంటే ఈ తప్పుడు అభిప్రాయాలు, తప్పుగా అర్థం చేసుకోవడం, తప్పుడు జ్ఞానం, ఇవన్నీ నీలో నుంచి పోవాలి. మనం సరైన జ్ఞానం పెంచు కుంటున్నాం అంటే అహం బ్రహ్మాస్మి, తత్వమసి, సర్వం ఖల్విదం బ్రహ్మ అని నేర్చుకుంటున్నాం కరెక్టే కానీ విచారణ ద్వారా నీ అవిద్యని, అజ్ఞానాన్ని పోగొట్టుకోకపోతే నువ్వు ఎంత జ్ఞానం తెలుసుకున్నా వృధా.

అందుకే రమణ భగవానుడు విచారణ అంటారు. మరి వశిష్టుల వారు కూడా విచారణే పరమజ్ఞానం అన్నారు.

అలాగే ఇప్పుడు చాలామంది కోరికల కోసం ధ్యానం అంటున్నారు. అసలు కోరికల కోసం ధ్యానం కానే కాదు. పరమాత్మ దర్శనం కోసమే ధ్యానం. ఎంతవరకు కోరిక ఉందో అంతవరకు నువ్వు మనోస్థితిలో ఉన్నట్టే అని ఎంతో వివరంగా ఈ పుస్తకాల ద్వారా ఇచ్చారు.

మరి ఎందుకు తెలుసుకోలేక పోతున్నారంటే? సరైన స్వాధ్యాయం చేయక. అంతేకాదు కోరికలు ఉంటే నువ్వు ఏ స్థితిలో ఉన్నట్టు?

అలాగే నువ్వే దైవం అని గురువు చెప్పాడు. మీరు ఈ సృష్టి వెనక పరమాత్మ తత్వం ఉంది అని తెలుసుకున్నప్పుడు, మీరు కోరుకోవాల్సింది ఏముంది? మీరే దైవాలైనప్పుడు దైవానికి కోరికలు ఏముంటాయి? ఎన్నీ తెలుసుకున్నా మీరు ఇంకా ప్రాపంచిక కోరికల కోసమే ధ్యానము అనుకుంటే అది తప్పుడు అవగాహనే.

మరి ఈ తప్పుడు అవగాహనకి కారణం సరైన స్వాధ్యాయం లేకపోవడం. ఆ తప్పుడు అవగాహన వల్లే ధ్యానాన్ని సంకల్పాల కోసం, కర్మనాశనం చేసుకోవడం కోసం చేస్తున్నారు. అంటే ఈ తప్పుడు జ్ఞానం, తప్పుడు అవగాహన వల్లే! సరైన జ్ఞానాన్ని అంటే సమ్యక్ జ్ఞానాన్ని పొందలేకపోతున్నారు.

మరి ఆ స్థితికి వెళ్ళాలి అంటే కింద మెట్టు వదిలాలి. కింద మెట్టు

వదిలితే కానీ పై మెట్టుకి వెళ్ళలేరు.

మరి కింద మెట్టైన కోరికలు శారీరక పరమైనవి అవ్వనివ్వండి, మానసిక పరమైనవి అవనివ్వండి, బుద్ధిపరమైనవి అవనివ్వండి ఏ కోరికలు ఉన్నా మీరు ఇంకా నేను శరీరం అనే భ్రాంతిని పోగొట్టుకోలేదు. ఇది మీరు ధ్యానంలోకి వచ్చాక మొట్టమొదటి తప్పుడు జ్ఞానం.

తప్పుడు అవగాహన అంటే గురువు చెప్పినప్పటికీ మీ అభిప్రాయం మారట్లేదు అంటే, కోరికలు పుడుతున్నాయి అంటే, ఇంకా మీరు జ్ఞానపరంగా ఎదగట్లేదని అర్థం. ఈ భూమిమీద ఉన్నవన్నీ అనుభవిస్తూ, ఉన్నదానితో తృప్తిగా జీవిస్తూ, మీ శరీరాన్ని సాధనకు ఉపయోగించాలి. సాధనకు ఉపయోగించాలి అంటే సరైన విద్య నేర్చుకోవాలి, సరైన తపస్సు ఆచరించాలి అన్నారు.

అంటే ఈ "శ్వాస మీద ధ్యాస" అనే ధ్యానం కోరికలను తీర్చు కోవడానికి కాదు. ఈ కోరికలన్నీ ఈ సృష్టికి సంబంధించినవే. ఈ సృష్టికి సంబంధించిన కోరికల కోసం సాధన కాదు. ఈ సృష్టిని సృష్టించిన సృష్టికర్త దర్శనం కోసమే ఈ సాధన అనే నిజమైన అవగాహన కలిగితే మీలో ఏ తప్పుడు ఆలోచనలు, తప్పుడు కోరికలు రావు. పరమాత్మ దర్శనం గురించి తప్పించి మీరు ఈ భూమిమీద ఏ కోరిక కోరినా మీకు గురువు చెప్పింది అవగాహన కాలేదు అని అర్థం.

పత్రిగారు 'ధ్యానం వల్లనే జ్ఞానం, జ్ఞానం వల్లనే ముక్తి' అని చెప్పారు. అంటే చిట్ట చివరి లక్ష్యం ముక్తి. అది మానేసి ఇంకా ప్రాపంచిక కోరికలు కోరుతున్నారు అంటే ఈ ధ్యానం మీద సరైన అవగాహన లేదని అర్థమవుతుంది.

సంకల్ప సిద్ధి అంటే భూమిమీదవి కావాలని కోరుకోవడం సంకల్పం అనుకుంటారు. కాదు మీరు పైలోకాల నుంచి క్రింది లోకాలకి వచ్చి, అన్ని రకాల అనుభవాలు పొంది, అన్ని రకాల పాఠాలు, అన్ని జన్మల్లోనూ నేర్చుకుని,

మానవ జన్మ తీసుకున్నారంటే మీరు ఒకే ఒక సంకల్పంతో ఈ జన్మ తీసుకున్నారు. ఏమిటా సంకల్పం అంటే? దేహం ఉండగానే దేహాన్ని సృష్టించిన వాడిని దర్శనం చేసుకోవాలని. ఆ మహా సంకల్పంతో ఆ లోకం నుంచి ఈ లోకానికి వచ్చి ఈ జన్మ తీసుకున్నారు.

కానీ గతజన్మ వాసనలు, సంస్కారాల వల్ల ఈ శరీరం భోగించడానికి వచ్చింది అనుకున్నారు. కానీ యోగం కోసం వచ్చిందని దాన్ని మర్చి పోయారు. ఇదే తప్పుడు జ్ఞానం. భోగించడానికి వచ్చాను అనుకోవడం తప్పుడు జ్ఞానం. యోగం కోసమే నేను భూమిమీదకు వచ్చాను అని తెలుసుకోవడం సరైన జ్ఞానం. ఎప్పుడైతే ఈ సరైన జ్ఞానం పొందుతారో యోగమార్గంలో నిశ్చింతగా ఉంటారు.

ఎంతసేపు కోరికలు ఉంటాయో మీ సాధన చక్కగా జరగదు. అందుకే అంటారు “నువ్వు విశ్వాన్ని వదలకపోతే విష్ణువు నీ హృదయంలో ఉండడు” అని. మీ చిత్తం శుద్ధిగా ఉంటేనే ఆ పరమాత్మ మీ హృదయంలో ఉండగలడు, మీరు ఆయన్ని దర్శించగలరు” అని ఎన్నో సందర్భాల్లో మనకి మహాత్ములు చెప్తూనే ఉన్నారు.

మీకు భగవంతుడి దర్శనం కావాలి అనుకుంటే ముందు మీ దృష్టిని మార్చుకోవాలి! అంటే నేను చూస్తున్న ప్రతీ జీవి ఆత్మ స్వరూపమే, అని మన దృష్టిని మార్చుకోగలిగితే ఈ ప్రాపంచిక కోరికలు చాలా మట్టుకు తగ్గిపోతాయి. ఎవరూ శత్రువులు కాదు, మిత్రులు కాదు అనే అభిప్రాయాన్ని మార్చుకుంటూ, వాళ్ళు వాళ్ళ అనుభవాల కోసం వచ్చారు అని అవగాహన చేసుకుంటే మీ దృష్టి ఎంతసేపూ ఆత్మ పైనే ఉంటుంది.

అందుకే మొదట ధ్యానంలోకి వచ్చాక అవిద్యని నాశనం చేసుకోవాలి అంటే ముందు అందరూ ఆత్మ స్వరూపులే అని గురువుగారు చెప్పిన మొట్టమొదటి  పాఠాన్ని మీరు పదే పదే నెమరు వేసుకోవాలి. నెమరు

వేసుకున్నప్పుడు మెల్లి మెల్లిగా అవన్నీ తొలుగుతాయి.

అందుకే శంకరాచార్యులవారు ఏం చెప్తారు అంటే! జ్ఞానం పెంచుకోవాలి అంటే ఈ అవిద్యని, అజ్ఞానాన్ని నాశనం చేసుకోవాలి అన్నారు అంటే తప్పుడు అభిప్రాయాలు, అపార్థాలు, తప్పుడు జ్ఞానాన్ని నాశనం చేసుకోవాలి. ఈ అవగాహన లోపం గురించి ఐదు విషయాలు తెలుకున్నాం. మరి అపార్థం ఎలా ఉంటుందో తెలుసుకుందాం.

## బి) అపార్థం చేసుకోవడం

ఈ అపార్థాలు ఏ విధంగా చేసుకుంటామంటే

1) ఒక్కొక్కసారి మంచి మాట చెప్తున్నా తప్పుడు మాటలాగా అర్థమవుతుంది.

2) ఒక మంచి భావాన్ని వేరే భావంగా అర్థం చేసుకుంటారు.

3) ఒక వ్యక్తి మంచి గుణాన్ని వేరే విధంగా, వాడి చేతకానితనంగా భావిస్తూ ఉంటారు.

4) ఒక ఆశయాన్ని తప్పుడు ఆశయంగా తెలుసుకుంటాం.

ఈ నాలుగు జీవితంలో నిత్యమూ చేస్తూనే ఉంటారు. వీటన్నిటికీ కారణం అహంకార, మమకారాలే అని శంకరాచార్యుల వారు చెప్పడం జరిగింది.

**1) ఒక మంచి మాట తప్పుడు మాట కింద అర్థమవ్వడం అంటే ?**

ఇలాంటి విషయాలు మనకి అర్థం అవడం కోసం, మీరు నేర్చుకుని జ్ఞానవంతులు అవ్వడం కోసం అష్టాదశ పురాణాల ద్వారా వ్యాసులవారు ఎన్నో ఉదాహరణగా చెప్పారు.

అసలు కోరిక ఉంటే ఎలా వుంటారు అన్నది సీతను చూసి నేర్చుకోవచ్చు. ఎందుకంటే అడవిలో బంగారు లేడిని చూసినప్పుడు అసలు ఈ సృష్టిలో బంగారు లేడి ఉంటుందా? అని ఆలోచించకుండా రాముడిని

కోరింది. కోరినప్పుడు రాముడు తెద్దామని వెళ్ళాడు. ఆయన శక్తి లక్ష్మణుడికి తెలుసు. మరి సీతమ్మకు లక్ష్మణుడు కాపలాగా ఉన్నప్పుడు, లక్ష్మణుడిని కూడా రాముడికి సహాయంగా వెళ్ళమంది. లక్ష్మణుడు ఎంతో నచ్చ చెప్పాడు. నచ్చచెప్తే మరి ఆవిడ వినకుండా చాలా పరుషంగా మాట్లాడింది.

మరి అక్కడ లక్ష్మణుడు చెప్పిన హిత వాక్యాలు సీతకు నచ్చలేదు. అంటే ఇక్కడ అర్థం చేసుకోవాల్సింది ఒక కోరిక కలిగితే ఎంతమంది చెప్పినా ఆ కోరికని ఆపుకోవడం సాధ్యం కాదు. అదే శంకరుల వారు చెప్తున్నారు. అందుకే ఎన్నో సార్లు, ఎన్నో విధాలుగా గురువులు తపస్సు ఉంటేనే కోరికల్ని తగ్గించుకుంటారని చెప్పారు. మరి అన్నీ వదిలి అడవికి వెళ్ళిన ఆవిడకి ఆ బంగారు లేడి మీద కోరిక కలగడం ఏమిటి? దాని వల్ల కష్టాల్లో పడటం ఏమిటి?

అలా సీతే కాదు మీకు కూడా కోరిక మితిమీరి ఉన్నప్పుడు ఆలోచించ కుండా మాటలు అనేస్తూ ఉంటారు. అలాగే సీతమ్మకి లక్ష్మణుడు ఎన్ని హిత వాక్యాలు చెప్పినా, అన్నయ్యకి ఏమీ కాదు, ఆయన శక్తివంతుడు అని చెప్తున్నా సరే ఆ మంచి మాటలు ఆవిడ తలకి ఎక్కక పరుషంగా మాట్లాడినప్పుడు ఆ మాటలకు ఆయన తట్టుకోలేక సీతమ్మని ఒంటరిగా వదిలి వెళ్ళాడు.

అంటే సీతకు మంచి మాటలు కూడా చెడ్డగా అనిపించాయి అదే అపార్థం చేసుకోవడం. ఆ సమయంలో సీత లక్ష్మణుడిని అపార్థం చేసుకుంది. అపార్థ దృష్టితో మాట్లాడింది.

**2) అలాగే ఒక భావం వేరొక భావంగా అర్థమవ్వడం**

మరి సీతమ్మని లంకకు తీసుకువెళ్ళిన రావణాసురుడికి విభీషణుడు ఎన్నో హిత వాక్యాలు చెప్పడం జరిగింది. ఎందుకంటే రాముడి శక్తి విభీషణుడికి తెలుసు, మంచివాళ్ళతో  విరోధం పెంచుకుంటే ఎప్పుడూ ప్రమాదమే అని కూడా తెలుసు. మరి అందుకే ఏ తప్పు చేయని రాముడితో యుద్ధం ఎందుకు?

సీతను అప్పచెప్పి క్షమాపణ కోరితే రాముడు ఒప్పుకుంటాడు అని ఎన్ని హిత వాక్యాలు చెప్పినా రావణుడు వినలేదు? పిరికి మాటలు మాట్లాడకు అన్నాడు.

అక్కడ యుద్ధం జరిగితే ఎంతో జననష్టం కలుగుతుంది అలా జరగకూడదని, అలాగే పరమాత్మతో, మంచివాళ్ళతో విరోధం తెచ్చుకోకూడదు అనే భావనతో విభీషణుడు రామణాసురుడికి ఎంతో నచ్చ చెప్పాడు. కాని రావణుడు వినలేదు.

అందుకే అంటారు “వినాశకాలే విపరీత బుద్ధిః” అని. వినాశకాలం దాపరించినప్పుడు బుద్ధి సరిగ్గా పని చేయదు. రావణుడు ఏమన్నా తక్కువవాడా? ఎంతో ధ్యానం చేశాడు, ఎంతో జ్ఞానం కూడా ఉంది, కానీ వినాశకాలం దాపరించినప్పుడు ఎన్ని తెలిసి వున్నా ఒక్కొక్కసారి తప్పులు చేయక మానరు. మరి రావణుడికి ఉన్న అహంకారం వల్లే మంచి అభిప్రాయంతో విభీషణుడు చెప్పిన మాటలు తలకెక్కక తన నాశనాన్ని తానే కొనితెచ్చుకున్నాడు. ఆ మంచి భావాన్ని కూడా అపార్థం చేసుకున్నాడు.

**3) అలాగే ఒక వ్యక్తి గుణం వేరొక రకంగా అనిపించడం :**

దుర్యోధనుడు ఎన్నో దుర్మార్గాలు చేస్తూ ఉన్నా దృతరాష్ట్రుడికి మంచివాడిగానే అనిపించాడు. కొడుకు మీద ఆ మమకారం వల్ల అన్నీ మంచిగా అనిపించాయి. మరి దానితో వినాశనమే జరిగింది. అలాగే పాండవుల యొక్క మంచితనం దుర్యోధనుడికి నచ్చలేదు, చేతకానితనం అనుకున్నాడు. అంటే ఒక మంచి గుణాన్ని కూడా చెడ్డగా అర్థం చేసుకున్నాడు నాశనమయ్యాడు. మమకారం వల్ల తన బిడ్డ ఎంత తప్పుడు మార్గంలో నడుస్తున్నా ధర్మాన్ని కూడా మర్చిపోయాడు దృతరాష్ట్రుడు.. మరి ఈ విధంగా తప్పుడు భావంతో తనకి నచ్చినట్టుగా ప్రవర్తించాడు.

**4) ఒక ఆశయం ఎదుటివాడికి వేరొక ఆశయంగా కనిపిస్తుంది :**

శ్రీ కృష్ణుడి ఆశయం దుర్మార్గులను హతమార్చడమే, ధర్మాన్ని

స్థాపించడమే. మరి గాంధారి అటువంటి కృష్ణుడికి శాపమే ఇచ్చింది. అంటే కృష్ణుడు ఆశయం అర్థం కాలేదు. మరి లోక కళ్యాణం కోసం చేస్తున్న ఈ ప్రయత్నాలు కృష్ణుడు ఎందుకు చేస్తున్నాడు? అని గాంధారి కొంచెం ఆలోచించ గలిగి ఉంటే తన పిల్లల దుర్మార్గాన్ని ఆపేది, భర్త ఇచ్చిన ఆజ్ఞలనీ ఆపేది.

మరి అక్కడికీ కృష్ణుడు పాండవులకి రాజ్యం ఇవ్వకపోతే, అడిగింది ఇవ్వకపోతే యుద్ధం తప్పదు అని కూడా హెచ్చరించే వచ్చాడు. అంటే అధర్మం జరిగినప్పుడు అది రూపుమాపడానికి యుద్ధం ప్రకటిస్తాడే కానీ తనకి వేరే కోరిక లేదు. కృష్ణుడికి అది ఒక ఆశయం. ఏం ఆశయము అంటే? "ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే అంటాడు". అంటే ధర్మాన్ని రక్షించడం కృష్ణుడి ఆశయం.

మరి ఏ విధంగా చూసినా కృష్ణుడు ధర్మం కోసమే చేశాడు కానీ తన స్వలాభం కోసం చేయలేదు. అలా చేయకపోయినా గాంధారి కోపంతో కృష్ణుడి వల్లే తన వంశం నాశనం అయింది అని, కృష్ణుడి వంశం కూడా నాశనం కావాలి అని ఆయన్ని శపించింది. ఇలా చాలామంది అహంకారంతో, మమకారంతో అపార్థాలు చేసుకొని లోక వినాశనం చేస్తారు. కారణం అవిద్య వల్ల.

అహంకారము, మమకారము ఈ రెండు మితిమీరి ఉంటే సత్యానికి దూరమవుతారు అని అజ్ఞానులకి తెలియకపోయినా జ్ఞానులకు తెలుసు. అందుకే మన ఉపనిషత్తుల్లో అహంకారం ఉండకూడదు అని చెబుతారు. ఆ అహంకారం లేనప్పుడే సత్యానికి దగ్గర అవుతారు. సత్యానికి దగ్గర అయిన వాళ్ళే విజయాన్ని సాధించగలరు అని తెలుసుకున్న వాళ్ళు ఈ అహంకార, మమకారాలు లేకుండా చూసుకుంటారు.

ఇప్పుడు చూడండి పాండవులకి, కౌరవులకి కూడా గురువు ద్రోణాచార్యుడే. విద్యలంటే నేర్పగలిగాడు కానీ, వాళ్ళ గుణాలను ఆయన

మార్చలేకపోయాడు. మరి పాండవులు సత్యంలో, ధర్మంలో ఉన్నారు కాబట్టి భగవంతుడు వాళ్ళ తరుపున ఉండి ఎన్ని కష్టాలు వచ్చినా, వాటి నుంచి ఆయనే రక్షించి బయట పడేసాడు. మరి కౌరవులు అహంకార పూరితంగా ఉన్నప్పుడు సత్యానికి దూరమైపోయారు.

అందుకే మీరు ధ్యాన మార్గంలోకి వచ్చి కూడా అజ్ఞానంలో ఉన్నప్పుడు మీకు అహంకారం, మమకారం మితిమీరి ఉండి ఎవరి మాటా వినరు. ఇప్పుడు కొందరికి మితిమీరిన మమకారం వుంటుంది. కానీ తీవ్రమైన బంధం ఉండకూడదు, బంధాల వల్లే బాధలు వస్తాయి అని చెప్తే.. ఎలా వదలగలమండి? అంటారు. ఆ మాట అన్నారు అంటే వాళ్ళకి మితిమీరిన బంధం ఉంది అని అర్థం. అలాంటప్పుడు వీళ్ళకు ఎంత చెప్పినా ఆ బంధం వలన వచ్చే నష్టం అనుభవిస్తే కానీ వీళ్ళలో మార్పు రాదు అని అర్థం చేసుకోవాలి.

ఒకసారో, రెండోసార్లో చెప్పాలి కానీ మితిమీరి చెప్పినా ఈ కాలంలో శత్రువులు అవుతారు. చూస్తూ చూస్తూ ఎలా ఊరుకుంటాం అని అంటారు. కానీ వాళ్ళకి ఏదో మూల ఆ మనసుకున్న మమకారం అనే మలినం వల్ల, నాకు ఒకరు చెప్పేది ఏమిటి అనే అహంకారం వుంటుంది. కానీ అది పోవాలి. ఈ రెండు వదలగలిగితేనే విశ్వ విజేతలు అవుతారు.

ఈ రెండూ వదలమంటే మనుషులని వదలడం కాదు. మనసుకున్న అహంకారం, మమకారం అనే గుణాలు వదలాలి. ఆ రెండూ వదిలితేనే ధర్మాన్ని నిలపగలరు కానీ ఆ రెండు ఉంచుకుంటే ధర్మాన్ని నిలపలేరు.

ఇప్పుడు మీరు ధ్యాన ప్రచారం చేస్తున్నారు. శరీరం మీద మమకారం ఉంటే అసలు బయటికే వెళ్ళలేరు. నేను ఇంత గొప్పవాడిని, నేను ఊరూరు తిరిగి చెప్పడం ఏమిటి అనే అహంకారం ఉన్నా ధ్యానం ఇంకొకరికి చెప్పలేరు. నా ఆస్తి, నా డబ్బు, నా పిల్లలకే దక్కాలి అనే మమకారం ఉన్నా ప్రక్క వాడి

గురించి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేరు. అన్ని దానాలలోకి జ్ఞానదానం గొప్పదని వేదికలెక్కి ఉపన్యాసాలు చెప్తే పరమాత్మ మెచ్చుకోడు.

వాక్కు ద్వారా చెప్పిన జ్ఞానం ఆచరణ ద్వారా చూపించగలిగినవాడే ఈ లోకంలో గొప్పవాడు అవుతాడు. ఆచరించకుండా నోటి వెంట ఏది వస్తే అది చెప్పడం కూడా గొప్ప కాదు. ముందు సరైన జ్ఞానం నేర్చుకోవాలి. అప్పుడే ఎదుటివాడికి చెప్పడానికి ప్రయత్నించాలి.

మీరు తప్పుడు అభిప్రాయం, తప్పుడు అవగాహన, అపార్థాలలోని ఉన్నారంటే ఇంకా మీకు గత జన్మల నుంచి వచ్చిన వాసనలు, సంస్కారాలు వదలలేదని అర్థం చేసుకోవాలి. ఒకవేళ ఉన్నాయో, లేవో అనే అయోమయ స్థితిలో ఉన్నప్పుడు ఇంకా గమనించుకోవాలి. కొంతమంది ఏ చిన్న సంఘటన జరిగినా విపరీతంగా బాధపడిపోతారు. అది కూడా అవసరం లేదు.

నా జీవితం నాకంటే ప్రకృతికే బాగా తెలుసు, భగవంతుడికే తెలుసు. ఇప్పుడు ఇది జరగట్లేదు అంటే ఇంతకంటే మంచి అవకాశం రావచ్చు, నా జీవితంలో ఇంతకంటే మంచే జరగొచ్చు అని పాజిటివ్ గా ఉంటే ఖచ్చితంగా మీ జీవితంలో మంచే జరుగుతుంది.

జీవితంలో ఏది జరగాలి అనుకున్నా ప్రతిదాన్ని అంగీకరిస్తూ బ్రతికితే ఆ జీవితం ఎంతో ఆనందంగా ఉంటుంది. ఒక్కొక్కళ్ళు ఆ జీవితాన్ని అంగీకరించలేక విమర్శించుకుంటూ, విచారణే లేక ప్రతి వ్యక్తిని విమర్శిస్తూ ఉంటారు. మరి ఎందుకు విమర్శిస్తున్నారు అంటే? సరైన అవగాహన లేక అవతల వ్యక్తిని అపార్థం చేసుకుంటున్నారు. వాళ్ళ మూర్ఖత్వం వల్ల మనకి అడ్డు తగలవచ్చు, ఆ మూర్ఖత్వం తొలగాలి అంటే మీలో శక్తి ఇంకా పెరగాలి. మనం ఇంకా మారాలి.

ధ్యానం లేకపోతే అవతల వ్యక్తులు మారరు. ధ్యానం ఉంటేనే అవతల వ్యక్తుల్లో మార్పు వస్తుంది. అందుకే అజ్ఞాని మారతాడని కోరుకునే బదులు,

జ్ఞాని నేను ఇంకా శక్తివంతుడిని అవ్వాలి, నేను ఇంకా అవతల వాడిని కూడా ప్రభావితం చేయగలిగేటంత గొప్పగా ఎదగాలి అని కోరుకుంటే తప్పనిసరిగా ఆ ప్రకృతే మీ డ్యూటీ తీసుకుని అవతల వ్యక్తిలో మార్పు జరిగేటట్టు చూస్తుంది.

అందుకే మీరు మాటతో ఏది సాధించలేరు, మౌనంతో ఎన్నో సాధించవచ్చు అని మహాత్ములు ఎప్పుడూ చెప్తూ ఉంటారు. ధ్యానానికి, జ్ఞానానికి ఉన్న భాష ఏమిటంటే? మౌనం. అదే పత్రిగారు సహనమే ప్రగతి అని చెప్తారు. నువ్వు సహించి, భరిస్తే నీ ఆధ్యాత్మిక ఉన్నతి ఆటోమేటిక్గా జరుగుతుంది. అవతలవాడిని తిట్టినా లాభం లేదు, అపార్థం చేసుకున్నా లాభం లేదు, అవమానించినా లాభం లేదు, మౌనంగా సాధన పెంచుకుంటూ ఉండాలి.

నాకు అవకాశాలు రాలేదే అని ఎప్పుడూ బాధపడొద్దు. అవకాశం వచ్చినా అందుకోలేని వాడు మూర్ఖుడు, అంటే ఇంకా ఏదో అవకాశం వస్తుంది, వస్తుంది అని అనుకుంటాడు మూర్ఖుడు అది వచ్చినా గుర్తించలేడు. మరి వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకునేవాడు మధ్యముడు, మరి ప్రతి క్షణాన్ని అవకాశంగా మార్చుకునేవాడు ఉత్తముడు.

కొంతమందిని భర్తలు భీమవరం వెళ్ళనివ్వరు. కొంతమందికి ఉద్యోగాల వల్ల వీలుకాకపోవచ్చు, కొంతమందికి వ్యాపారాల వల్ల వీలుకాక పోవచ్చు మరి కుదరట్లేదు అని బాధపడటం కాదు. ఇంట్లో కూర్చుని ధ్యానం చేసుకోవాలి, లైవ్ ఇస్తున్నారు వినాలి. అలా చేస్తూ, వింటూ ఉంటే పూర్తిగా వస్తుందని నేను చెప్పను కానీ 50% అయినా మీరు సాధిస్తారు.

మరి అవకాశాలు కొంతమందికి వచ్చి, కొంతమందికి రాలేదు అంటే ఎదుటి వ్యక్తి వల్ల కాదు, నాలో ఇంకా ఏదో లోపం ఉంది? ఇది నా సహనానికి పరీక్ష అనుకోవాలి. ఎందుకంటే ధ్యానానికి రాకముందు నాలో చాలా అహంకారం ఉంది. నేను ఏమన్నా చెల్లేది, నా పనే కరెక్ట్ అనే అహంకారంతో ఉన్నాను. మరి ఈవాళ నేను అన్నది జరగట్లేదు అంటే నా అహంకారం

పోలేదు కాబట్టి నేను ఇంకా సాధన చేయాలి, నా మనసు ఇంకా ప్యూరిటీగా ఉంచుకోవాలి. ఎదుటి వ్యక్తుల్లో తప్పు కాదు నాలోనే ఏదో తప్పు ఉంది, అది నేను మార్చుకోవాలి అని ప్రతి క్షణం విచారణ చేసుకుంటూ ఉండాలి.

గమనించండి కొంతమందిని భీమవరం వెళ్ళనివ్వరు, కానీ క్లాసులకి వెళ్ళనిస్తారు. నేను భీమవరం వద్దంటే ఇది ఎందుకు వెళ్తుంది? అని వాళ్ళకి పంతం. అలాంటప్పుడు సరే నేను మానేస్తాను, ఇంట్లోనే ధ్యానం చేస్తానని కొన్ని రోజులు ఓపిక పట్టండి మీకు తప్పకుండా అవకాశాలు వచ్చే తీరతాయి.

అలా ప్రతిదానిలో కూడా సహనం చూపిస్తూ, సాధన చేస్తూ, జ్ఞానం పెంచుకోవడానికి తపనపడితే తప్పకుండా ప్రకృతి మీ ఆశయాన్ని ముందుకు నడిపిస్తుంది. ధ్యాన మార్గంలోకి వచ్చినప్పుడు నేనే కరెక్టు అని ఎప్పుడూ అనుకోకూడదు. ఇంకా నాలో ఏ లోపాలు ఉన్నాయి? ఏవి సరి చేసుకోవాలి? ఇంకా లోపాలు ఉన్నాయి కాబట్టే నేను భూమిమీద ఈ వేదన అనుభవిస్తున్నాను, అలాగే నాకు దుఃఖమే లేని స్థితి ఉంది అంటే నా లోపాలన్నీ, నా పాప కర్మలన్నీ దగ్ధమయ్యాయి అని మీకు అవగాహన రావాలి.

ఎంతసేపు మనసుని శుద్ధి చేసుకోవడానికి ప్రయత్నించాలి కానీ ప్రక్కవారి గురించి మనం ఆలోచించాల్సిన అవసరమే లేదు. ఒక్క నిమిషం ప్రక్కవారి గురించి ఆలోచించినా మీ సాధన, మీ జ్ఞానం కోల్పోతున్నట్టే. ప్రాపంచిక జీవితంలో సంసారం కోసం, సంఘం కోసం, బంధువుల కోసం, అందరి కోసం బ్రతికారు. కానీ ఇప్పుడు మీ డ్యూటీ ఏమిటో తెలుసుకుని ఆ డ్యూటీ చేసుకుంటున్నారు. మీ కోసం మీరు ప్రతి నిమిషం పాటుపడాలి.

ఈ సాధన, జ్ఞానం అన్నది మీ ఆత్మోన్నతికి, మనసును శుద్ధిగా ఉంచుకోవడానికే. ధ్యానం లేకపోతే మాట నిలబెట్టుకోలేరు, మాట జారిపోతూ ఉంటారు. అలా మాట జారకూడదంటే ఇంద్రియాలకి శక్తి కావాలి, మాట్లాడ కూడదు అంటే మాట్లాడకూడదు, చూడకూడదు అంటే చూడకూడదు, విన

కూడదు అంటే వినకూడదు, అలా నిగ్రహించుకునే శక్తి సాధనలోనే సాధిస్తారు. సాధన ద్వారా మేధాశక్తిని పెంచుకుంటారు, బుద్ధి వికసింప చేసుకుంటారు, జ్ఞానం పెంచుకుంటూనే ఉంటారు.

మనసు అశుద్ధంగా ఉన్నంతసేపు ఆత్మ నుంచి బుద్ధికి ప్రజ్ఞ అందదు. మనసుని శుద్ధంగా ఉంచుకుంటేనే ఆత్మ నుంచి వచ్చే ప్రజ్ఞ బుద్ధికి అందుతుంది. ఇదే మనకి గుర్తు. ఆత్మ నుంచి ప్రజ్ఞ  అందలేదు అంటే ఈ జన్మలో చేసిన కర్మలో, లేకపోతే గత జన్మలోని వాసనలో ఇంకా మీ మనసును పట్టి ఉన్నాయి అని అర్థం చేసుకోవాలి.

అలాగే ఇక్కడ నాకు అహంకారం, మమకారం  ఉంటే నేను సత్యానికి దూరమవుతాను. సత్యానికి దగ్గర అవ్వాలి అంటే ఈ రెండూ వదులుకోవాలి. సత్యానికి దూరమయ్యే పనులు నేను ఎప్పుడూ  చేయకూడదూ అని తెలుసు కోవాలి.

అందుకే ఎదుటివాడు ఎలా ప్రవర్తిస్తున్నా మీకు అనవసరం. ఎందుకంటే? వాడి ప్రవర్తన మీ సాధనను తగ్గించదు, మీ జ్ఞానాన్ని తగ్గించదు. మీ సాధనని, మీ జ్ఞానాన్ని తగ్గించేది మీ మనసే. ఎందుకంటే మనసులో ఎప్పుడూ అక్కర్లేని వారి గురించి ఆలోచిస్తుంటారు. మీకు ఒక్క పైసా కూడా లాభం లేని వాళ్ళ గురించి ఆలోచిస్తున్నారు, అపార్థాలు చేసుకుంటున్నారు, అవగాహన ఉండట్లేదు.

నీ మనసే నీకు శత్రువు. వాళ్ళని నువ్వు స్వీకరిస్తున్న మూలానే నీకు సాధన కుదరట్లేదు. వాళ్ళని బాహ్యంగా బంధువులనుకుంటున్నావు, కానీ అంతరంలో భగవంతుడే నాకు బంధువు అని ఎప్పుడైతే అనుకుంటావో ఎప్పుడూ ఆనందమే. అందుకే వశిష్టుల వారు "బాహ్య ప్రపంచంలో ఉన్నప్పుడు నువ్వు ద్వైతంలో వుండు, కానీ అంతరంలో వున్నప్పుడు అద్వైతంలో వుండు" అంటారు.

నేను ఆత్మని, నేను అంతటా ఉన్నాను, నేనే సర్వాత్మని, నేనే పరమాత్మని అని ఎప్పటికప్పుడు ధ్యానంలో మీకు గుర్తు రావాలి. నేను ఆత్మనై ఉండి నేను ఆత్మానుభూతి పొందట్లేదు అంటే కారణం మనసు అనే మేఘం. మనసు అనే పొర. చూడండి సూర్యుడికి ఎంతో ప్రకాశం ఉంది. మేఘం రాగానే ఆ ప్రకాశం తగ్గిపోతుంది. అలా అని సూర్యుడు లేనట్టా అంటే? సూర్యుడు ఉన్నాడు, మేఘం అడ్డు వల్ల అలా ఉంది.

మీకు కూడా లోపల ఆనందం అనే పరమాత్మ, కోటి సూర్యుళ్ళ ప్రకాశం ఉంది. మరి అలాంటి పరమాత్మలు మీరే అయి ఉండీ ఈ భ్రాంతుల్లో ఎందుకు పడుతున్నారుం? అంటే? అహంకార మమకారాలు అనే మేఘాలు అడ్డుగా వస్తున్నాయి. ఈ మేఘాలను తొలగించుకునే మార్గమే ధ్యాన సాధన. మీరు సాధన చేస్తూ ఈ అభిప్రాయాన్ని మార్చుకోకుండా ఉండగలగాలి. అలాగే జ్ఞానం పెంచుకుంటూ ఉండాలి.

నా ప్రకాశాన్ని బయటకి తీయాలి అంటే నేను ఆత్మని అనే జ్ఞానం ఏమరపాటుగా కూడా మర్చిపోకూడదు. రెప్పపాటులో మర్చిపోయినా మళ్లీ మాయ ప్రపంచంలోకి తీసుకువెళ్ళిపోతుంది. అందుకే అనుక్షణం నేను ఆత్మని అనే ఎరుకను కోల్పోకుండా దాన్ని ఇంకా ఇంకా జ్ఞాపకం ఉంచుకోడానికి ధ్యానం చేయాలి.

అంటే జాగ్రదావస్థలో మర్చిపోతున్నారు, మళ్ళీ ధ్యానంలో కూర్చున్నప్పుడు గుర్తు తెచ్చుకుంటారు. ఏ పని చేస్తున్నా నేను ఆత్మని అనే ఎరుకని కోల్పోకుండా ఉన్నప్పుడు మనసుకున్న మలినాలన్నీ తొలగించు కుంటారు. పెద్ద మలినాలు అయిన అహంకారము, మమకారం ఎప్పుడైతే పోతాయో అప్పుడు శుద్ధాత్మగా తయారవుతారు. మీ మనస్సు మురికి పట్టి ఉంది, ఆ మురికిని వదిలించుకునే మార్గమే ధ్యానము.

ఈ ధ్యానం వల్ల మాత్రమే ఈ తప్పుడు అభిప్రాయాలు, అపార్థాలు, అన్నీ తొలగించుకొని సరైన అవగాహనతో గొప్పగా ఎదగగలరు.

# బ్రహ్మవిద్య గొప్పతనం!

మీరు ఈ బ్రహ్మ విద్య నేర్చుకుంటూ దాని గురించి తెలుసు కుంటున్నారు. మరి ఈ బ్రహ్మ విద్య నేర్చుకోవడం వల్ల వచ్చే లాభాలు ఏమిటి? ఎవరు ఈ విద్యని నేర్చుకోవడానికి అర్హులు? అన్నది తెలుసుకుందాం. బ్రహ్మ విద్య అంటే బ్రహ్మము గురించి తెలియజేసే విద్య. విద్య అంటే జ్ఞానము. మరి బ్రహ్మము గురించి తెలిపే విద్యని పరావిద్య అని, ప్రాపంచిక విద్యని అపరావిద్య అని చెప్పడం జరిగింది.

అయితే ప్రాపంచిక విద్య నేర్చుకోవడానికి అందరికీ అర్హత ఉంటుంది కానీ, ఈ పరా విద్య నేర్చుకోవాలంటే కొందరికే అర్హత ఉంటుంది. చాలామంది ఈ పరా విద్య నేర్చుకుంటే లాభం ఏమిటి అని? ఇది ఎందుకూ పనికి రాని విద్య అని అంటూ ఉంటారు. అపరా విద్య నేర్చుకుంటే బోలెడు డబ్బు సంపాదించొచ్చు అని అనుకుటున్నారే కానీ పరా విద్య ఎంత ఉపయోగమో, ఎంత లాభమో కూడా తెలుసుకోలేనంత హీన స్థితిలో వున్నారు. వాళ్ళు అజ్ఞానంతో అలా మాట్లాడతారు.

ఈ పరావిద్య అంటే ఈ బ్రహ్మ విద్య గురించి మనకి వేదాల్లో కూడా ఇవ్వడం జరిగింది. వేదమంతా ముందు అపరావిద్య గురించి చెప్పి తర్వాత పరావిద్య గురించి చెప్తుంది. పరావిద్య నేర్చుకున్నవాడు ఈ భూమి మీదే కాదు పరలోకాల్లో కూడా చాలా ఆనందంగా సౌఖ్యాలను పొందుతాడు అని చెప్పడం జరిగింది.

కానీ చరిత్ర చూస్తే ప్రపంచం మెల్లి మెల్లిగా కృతయుగం దాటి త్రేతా యుగం, త్రేతా యుగం దాటి ద్వాపర యుగం, ద్వాపర యుగం దాటి కలియుగం ఇలా ఒక్కొక్క యుగం మారుతూ వచ్చేటప్పటికి మానవులకి ఈ బ్రహ్మ విద్య మీద ఆసక్తి తగ్గింది. ఈ బ్రహ్మవిద్య మీద ఆసక్తి ఏ కొద్దిమందికో ఉంది కానీ అందరికీ లేదు అని మనకి అర్థమవుతూ వుంది.

అలాగే ఈ అపరావిద్య ఎవరైనా నేర్చుకోవచ్చు కానీ పరావిద్య నేర్చుకోవడానికి మాత్రం ఏ కొద్దిమందికో అర్హత వుంటుంది అని అధ్యయనం చేస్తే మనకి అర్థమవుతుంది. అంటే పరమాత్మను తెలుసుకోవడానికి అర్హత కొద్ది మందికి మాత్రమే ఉంటుంది కానీ అందరికీ ఉండదు. ఆ పరబ్రహ్మము గురించి అధ్యయనం చేయడం అంటే చాలా కష్టం. కానీ ఇష్టమైన వాడికి ఏదీ కష్టం కాదు. అందుకే దీని లాభాలు తెలుసుకున్న వారికి ఇది కష్టం కాదు.

కానీ అర్హత లేని వాడికి దీని లాభమూ తెలియదు, ఇది పొందే అర్హతా ఉండదు. పరలోక సౌఖ్యాల గురించి కూడా అర్థం కాదు. కొంతమంది పరలోకాలు ఉన్నాయో? లేదో? మాకు తెలియదు కాబట్టి ఇహలోకంలో సుఖపడాలి అంటారు. వీళ్ళ మాటలు వింటూ ఉంటే నాస్తికులకి వీళ్ళకి పెద్దగా తేడా లేదు అనిపిస్తుంది. ఎందుకంటే నాస్తికులు లేదనే చెప్తారు, కాని వీళ్ళు అనుమానం వ్యక్తం చేస్తారు.

మన ఉపనిషత్తులు ఏం చెప్తున్నాయంటే? పరావిద్య లేని జాతి ఎప్పుడూ వెనక్కి వెళ్ళిపోతుంది, అడుగంటిపోతుంది, పరాధీనులు అవుతారు అని చెప్తుంది. ఎప్పుడైతే జనాల్లో బ్రహ్మ విద్య లోపిస్తుందో పశువుల్లాగా పరాధీనులువుతారు అని మన వేదాంతం చెప్తుంది. మరి సత్యాన్ని తెలుసుకుందామని కాషాయం కట్టుకున్నా ఈ బ్రహ్మవిద్య, ధ్యానము, లోపిస్తే వారు సాధువులు కాలేరు. సత్యాన్ని తెలుసుకున్న వాళ్ళు, సత్యంలో జీవించే వాళ్ళే నిజమైన సాధువులు.

అలాగే ఎవరికైతే బాహ్యేంద్రియ నిగ్రహం, అంతరేంద్రియ నిగ్రహం ఉంటుందో, ఎవరైతే గురువు ద్వారా తెలుసుకున్న బ్రహ్మజ్ఞానాన్ని ధ్యానము ద్వారా అనుభవంలోకి తెచ్చుకుంటారో వారే సత్యాన్ని చెప్పే అర్హత సంపాదించు కుంటారు. అంటే గురువు ద్వారా అహం బ్రహ్మోస్మి, తత్వమసి, సర్వం ఖల్విదం

బ్రహ్మ అంటే ఈ సృష్టి అంతా బ్రహ్మమయమే, బ్రహ్మ యొక్క చైతన్యంతోనే ఈ సృష్టి నడుస్తుంది అని తెలుసుకున్నప్పుడు, ఈ బ్రహ్మవిద్య వాళ్ళకి బాగా అర్థమవుతుంది. దానికి తీవ్రాతి తీవ్రమైన సాధన ఉండాలి. ధ్యానం లేకపోతే గురువు చెప్పినా విద్య రాదు. గురువు చెప్తాడు కానీ శిష్యుడే దాన్ని అనుభవంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నించాలి.

అందుకే ఈ బ్రహ్మ విద్య లేని వాళ్ళు పరాధీన బ్రతుకులు బ్రతుకుతారు అని అన్నారు. మరి సాధువులు అని చెప్పుకున్న వాళ్ళు కూడా ఈ బ్రహ్మవిద్య అర్థం చేసుకోలేక, ఆచరణలో పెట్టుకోలేక, ధ్యానము లేక, బాహ్యేంద్రియ, అంతరేంద్రియ నిగ్రహం లేక సత్యాన్ని చెప్పే అర్హతని కోల్పోతారు అని ఎంతో చక్కగా మన వేదాంతం చిట్ట చివరగా  హెచ్చరికలు చేసింది.

చాలామంది మేము క్లాసులు చెపుతున్నాం ధ్యానం చేయక్కర్లేదు అనుకుంటారు. కానీ వేదాంతం స్పష్టంగా చెప్పింది మీరు ఎంత తెలుసుకున్నా, నేర్చుకున్నా ఆత్మవిద్య, బ్రహ్మవిద్య సాధన లోపిస్తే, ఇంద్రియ నిగ్రహం లేక చెప్పే అర్హత కోల్పోతారు. అందుకే బ్రహ్మవిద్య అనేది కత్తి మీద సాము లాంటిది అంటారు. ఎందుకు అన్నారు అన్నది మనం ఇవన్నీ చదువుతుంటే అర్థమవుతుంది.

ధ్యానం మీద అశ్రద్ధ ఉన్నా, ఇంద్రియ నిగ్రహం లేకపోయినా, ధర్మాన్ని ఆచరించకపోయినా, అపవిత్రమైన జీవితం జీవిస్తున్నా, సత్యాన్ని చెప్పే అర్హతని కోల్పోతారు. మరి వాళ్ళు పరాధీన బ్రతుకులు బ్రతుకుతారు అని చెప్పడం జరిగింది.

అందుకే “రత్నగర్భ అయిన నా దేశం ఆధ్యాత్మికత లోపించడం వల్లే ఈరోజు అప్పులు పాలైంది, ఏనాడైతే నా దేశం ఆధ్యాత్మికతలో ముందు ఉంటుందో మళ్లీ రత్న గర్భ అవుతుంది” అని వివేకానందుడు చెప్పడం

జరిగింది. అందుకే ఈ లోకంలో చక్రవర్తుల కంటే చక్రవర్తి ఎవరయ్యా అంటే బ్రహ్మవిద్య నేర్చుకున్నవాడే అని ఆ రోజుల్లో చాలా గొప్పగా చెప్పేవారు.

ఎందుకంటే చక్రవర్తులు కూడా బ్రహ్మ విద్య నేర్చుకున్న బ్రహ్మజ్ఞాని పాదాల మీద పడేవారు, కానీ బ్రహ్మజ్ఞాని ఎప్పుడూ ఎవరి పాదాలు పట్టుకోడు. అంటే అంత గొప్పది బ్రహ్మ విద్య, ఆ పరబ్రహ్మ గురించి తెలుసుకునే విద్య.

మరి ఈ బ్రహ్మవిద్య వల్ల లాభం ఏమిటంటే? ఇహలోకంలో గౌరవం, పరలోకంలో ఆనందం పొందుతారు అని చెప్పారు. అలాగే గమనిస్తే ఎంతటి పాపాత్ముడైనా, సముద్రమంత పాపాలు చేసినా, ఆ పాపాల నుంచి ఈ భూలోకంలోనే బ్రహ్మ విద్య ద్వారా విముక్తుడు కావచ్చు అన్నారు. అపవిత్రమైన మనసు ఉన్నవాడికి బ్రహ్మవిద్య రాదు, తెలుసుకోలేరు అన్నారు. కానీ ఎప్పుడైతే బ్రహ్మవిద్య నేర్చుకుంటూ సాధన చేస్తారో ఈ భూమిమీద ఉండగానే నరకానికి వెళ్ళవలసిన అవసరం వుండదు.

వాల్మీకి చరిత్ర తీసుకుంటే ఆయన ఎన్నో జీవులని వేటాడాడు, హింసించాడు, ఎంతో పాపం చేశాడు. అయినా కూడా ఒక బ్రహ్మజ్ఞాని అయిన నారదుల వారి నోటి వెంట ఈ బ్రహ్మజ్ఞానాన్ని తెలుసుకుని ఎంతో కష్టపడి 14 సంవత్సరాలు ఏకధాటిగా ధ్యానంలో ఎంతో పట్టుదలగా కూర్చుండి పోయాడు. అంటే ప్రతివాడికి లోపల ఆ శక్తి ఉంది కానీ ప్రయత్న లోపం వల్ల సాధించలేరు.

ఈ ప్రపంచం కావాలి అనుకుంటే మనసు యొక్క ప్రమేయం ఉంటుంది, కానీ ఈ ప్రపంచం వద్దు పరలోకంలో మోక్షమే కావాలనుకునే వాడికి ఆత్మశక్తి అనంతంగా పని చేస్తుంది అని మనకి వాల్మీకి చరిత్ర చూస్తే అర్థమవుతుంది. మనసుకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడు ఈ శరీరానికి ఆహారం కావాలి, ఇంకా చాలా కావాలి. కానీ ఆయన ఆత్మకు ప్రాధాన్యం ఇచ్చారు.

ఎవరికైనా శరీరం నశించిపోయేదే, కానీ ధ్యానంలో మరణించినా

మరుజన్మ ఉత్తమ జన్మ వస్తుంది అని నారదులవారు ఎప్పుడైతే బోధించారో వాల్మీకి ఎంతో కష్టపడి సాధన చేసి బ్రహ్మజ్ఞానిగా ఎదిగి, పాపపు లోకానికి వెళ్ళవలసిన ఆయన మోక్ష స్థితికి చేరాడు. అంటే కష్టమైన ఈ బ్రహ్మ విద్య గురించి ప్రయత్నిస్తూ సాధన చేస్తే నరకం నుంచి మోక్షాన్ని పొందే అర్హత వస్తుందని ఇక్కడ చెప్పడం జరిగింది.

అయితే ఒక్కొక్కళ్ళు చదువుకోరు అంటే పరావిద్య పొందే అవకాశం లేకపోవచ్చు. కానీ వాళ్ళకి ఏ పుణ్యం వల్లో నారదుడు లాంటి గురువు దొరికినప్పుడు, వాళ్ళు ఈ జ్ఞానం గురించి విన్నప్పుడు వారు ఎంత పాపాత్ములైనా తమ ప్రయత్నంతో ఆ పాపాలను రహితం చేసుకునే అర్హత ఉంది అని మనకి వాల్మీకి చరిత్ర చూస్తే అర్థమవుతుంది.

అయితే ఒకసారి విని సాధనలో కూర్చోవడం కాదు, ఆ త్రేతా యుగంలో రత్నాకరుడికి దొరికిన వాతావరణం ఈ యుగంలో మనకి దొరకకపోవచ్చు. అందుకే ద్వాపర యుగంలో చిట్ట చివరిగా చెప్పిన ఈ వేదాంతం ఏం చెప్తుందంటే? బ్రహ్మ విద్య పొందాలి అంటే నిత్యము బ్రహ్మ విచారణ ఉండాలి. అందుకే విచారణ, విచారణ అని మనం ఎన్నో సార్లు చెప్పుకుంటున్నాం.

బ్రహ్మము అంటే ఎవరు అనే విచారణ జరగాలి. బ్రహ్మము అంటే సర్వ జీవులలో అంతర్యామిగా, ఆత్మగా వున్నవాడు. సృష్టి అంతా తన చైతన్యం తోనే నడిపిస్తున్నవాడు. మరి అర్హత ఉన్నవాళ్ళకి ఈ ప్రకృతి ద్వారా అన్నీ అందజేయబడుతున్నాయి అని మనం తెలుసుకుంటూ నిత్యము ఈ బ్రహ్మ విచారణ జరుపుకుంటూ ఉండాలి.

అలాగే సమము అంటే అంతరేంద్రియ నిగ్రహము ఉండాలి. మనిషి మనసు ప్రభావంతో జీవిస్తాడు కాబట్టి మొదట సమమే చెప్తారు అంటే మనసుకి ఈ బ్రహ్మము గురించే తెలియజేస్తూ ఉంటే ప్రాపంచికం మీద ఆసక్తి తగ్గి

బ్రహ్మము మీద ఆసక్తి పెరుగుతుంది. ప్రపంచంలో ఉంటూ ప్రపంచం మీద ఆసక్తి తగ్గించుకోవడం చాలా కష్టం. కానీ చూసే ప్రతిదాని వెనక ఆ పరమాత్మ యొక్క శక్తే ఉంది. ఒక ఆహారం తీసుకున్నా, శ్వాస తీసుకున్నా, ఒక పానీయం తీసుకున్నా, ఫలాలు తింటున్నా వచ్చే వైభోగం బ్రహ్మం యొక్క చైతన్యంతో జరుగుతుంది.

ఈ ప్రపంచంలో ఉంటూ ఇలా ప్రతిదాన్ని విచారణ చేసుకుంటూ ఈ బ్రహ్మ విద్య గురించి తెలుసుకోకపోతే నువ్వు అసంపూర్ణంగా తెలుసుకున్నట్టే. బ్రహ్మవిద్య తెలుసుకున్నప్పుడే నువ్వు సంపూర్ణంగా తెలుసుకున్నట్టు.

ఒక్కొక్కళ్ళు ఏం చేస్తారంటే? గురువు ద్వారా ఈ ఆత్మజ్ఞానం, బ్రహ్మజ్ఞానం తెలుసుకున్నా ఆసక్తి చూపించరు. ఎందుకు చూపించరు అంటే? వాళ్ళకి దీని గురించి అధ్యయనం చేయడం, విచారణ చేయడం తెలియదు. కానీ ఇవన్నీ మనకి తెలుస్తున్నాయి అంటే మనకి అర్హత ఉంది అని అర్థం చేసుకోవాలి. మరి ఎవరైతే బ్రహ్మజ్ఞానం గురించి విచారణ చేస్తూ ఈ విషయాలన్నీ సేకరిస్తారో వారికి బ్రహ్మము మీద ఆసక్తి పెరుగుతూ ఉంటుంది.

అలాగే దమము అంటే బాహ్యేంద్రియ నిగ్రహం కూడా ఉండాలి. మీరు ప్రపంచంలో ఉంటూ మీ బాహ్యేంద్రియాలు ప్రపంచంలోనివి సంపాదించడానికి ఉపయోగిస్తారు. లేదా ప్రపంచంలోనివి అనుభవించడానికే ఉపయోగిస్తారు. కానీ ఈ ఇంద్రియాలతో స్వాధ్యాయం చేయాలి, చెవులతో బోధలు వినాలి, నోటిని సత్యాన్ని చెప్పడానికే ఉపయోగించుకోవాలి.

అంటే ముందు సత్యం గురించి అధ్యయనం చేస్తే అంతరేంద్రియాన్ని, బాహ్యేంద్రియాల్ని సత్యం కోసం ఉపయోగించుకునే అర్హత వస్తుంది. ఎంతగా అధ్యాయనం చేస్తే సత్యాన్ని చెప్పే అర్హత నీకు అంతగా వస్తుంది అని చెప్పారు. మీరు ఆత్మజ్ఞానం, బ్రహ్మజ్ఞానం పెంచుకుంటునప్పుడు మీలో అవిద్య, అజ్ఞానం, అహంకారం ఈ మూడు నాశనం అవుతాయి.

మీరు ఎప్పుడైతే బ్రహ్మము గురించి అధ్యయనం చేస్తారో అప్పుడు మీకు అవగాహనా శక్తి పెరుగుతూ ఉంటుంది. అజ్ఞానం పోయి జ్ఞానం పెంచుకుంటూ ఉంటారు. అలాగే నేను నేను అనే ఈ మేనుకి ప్రాపంచిక విద్య వల్ల కానీ, డబ్బు వల్ల కానీ, అహంకారం పెరుగుతుంది. కానీ బ్రహ్మజ్ఞానం తెలుసుకున్న వెంటనే నాదంటూ ఏదీ లేదు, అంతా పరమాత్మదే, నా గొప్ప ఏమీ లేదు అనుకుంటారు, అహంకారం కూడా నశించిపోతుంది. ఈ బ్రహ్మ జ్ఞానం వల్ల అహంకారము, అవిద్య, అజ్ఞానము పోతాయి.

అలాగే బ్రహ్మ జ్ఞానం వల్ల సత్శీలము, పవిత్రత ఈ రెండు అలవాటవుతాయి. సత్శీలము అంటే క్యారెక్టర్ ఎప్పుడూ కరెక్ట్‌గా ఉంచుకుంటారు. మరి సత్ప్రవర్తన అంటే అందరితోటి ప్రేమతో ఉండ గలుగుతారు. ప్రతి వారిలో అంతర్యామిగా పరమాత్మ ఉన్నాడు కాబట్టి ప్రతి వాళ్ళని కూడా ప్రేమించే మనస్తత్వం వస్తుంది. మీకు అపవిత్రత పోయి పవిత్రత ఎప్పుడైతే వచ్చిందో, సత్శీలము ఎప్పుడైతే వస్తుందో అప్పుడు మీకు సత్యాన్ని చాలా నిర్భయంగా మాట్లాడగలిగే శక్తి వస్తుంది.

చాలామంది మాకు భయం అని చెప్తారు. ఎందుకు భయము అంటే ఎక్కడో లోపల తప్పు జరుగుతోంది. మీరు ఇంకా మమకారానికి, అహంకారానికి, భయానికి వశం అవుతున్నారంటే లోపల ఎక్కడో అపవిత్రత అనేది ఉంది. అపవిత్రత అంటే అక్కర్లేని ఆలోచనలు. వాడు చెడ్డ, వీడు చెడ్డ అని ఎదుటివాడి గురించి చెడ్డగా అంటారు. అంటే ఇంకా మీలో తప్పు జరుగుతోంది అని అర్థం చేసుకోవాలి.

అందరినీ ప్రేమిచడం అంటే తప్పు చేసినా క్షమించడం కాదు. తప్పును కూడా నిర్భయంగా చెప్పడమే. వాళ్ళు తాత్కాలికంగా బాధపడొచ్చు కానీ శాశ్వతంగా సత్యంలో ఉంటారు. అందుకే గురువు అనేవాడు తప్పుల్ని ఎప్పుడూ సమర్థించడు, తప్పులను సమర్థిస్తే గురువే కాదు. తప్పులను సరిదిద్దితేనే గురువు అవుతాడు.

ఇప్పుడు మీ అందరికీ అనిపించొచ్చు మేడం మాట్లాడరు. మరి సార్ గట్టిగా చెప్తారు అని అంటారు. నిజంగా నేను ఇంకా రాఘవరావుగారంత ఎదగలేదు. నాకు సత్యం తెలుసు, ధర్మము తెలుసు చెప్తేనే బాగుపడతారు కానీ, నేను ఆయనంత ఎదగలేదు కాబట్టే గమ్మున మాట అనలేకపోతున్నాను. నా నోటివెంట రావట్లేదు అంటే నాకు ఇంకా అంత ధైర్యం లేదు అని నాకు అర్థమవుతుంది. ఇంకొకటి కూడా ఉంది రాఘవరావు సార్ అంటున్నారు కదా ఇంక నేను ఎందుకు అనడం అని ఇంకొక ధీమా కూడా వుంది.

ఎందుకంటే ఇద్దరం భార్యా భర్తలం కాబట్టి, ఇద్దరము ఒక పనే చేస్తున్నాం కాబట్టి, ఒకళ్ళు చెప్తుంటే ఇంక మళ్ళీ రెండో వాళ్ళు చెప్పడం ఎందుకు? ఎందుకంటే ఒక్కసారి చెప్పినప్పుడు గ్రహించగలిగే శక్తి మీకు ఉంది అని నాకు అర్థమయింది. ఇలా ఎన్నో కారణాలు ఉన్నాయి అందుకే నేను చెప్పట్లేదు. ఇక్కడ గమనించండి గురువు అనేవాడు ఎప్పుడూ కూడా లోపల ప్రేమ వున్నా బయటకి కఠినంగా కనిపిస్తాడు. మన యోగక్షేమాలు కోరేవాడే మన తప్పుల్ని సరిదిద్దుతాడు అని శిష్యులు తెలుసుకోవాలి.

బ్రహ్మజ్ఞానం పొందడం అంటే ఆటోమేటిక్‌గా వచ్చేది కాదు. ఇప్పుడు శిష్యులైనా సరే, సాధన చేసేవాళ్ళైనా సరే, ఒకరోజు నేర్చుకున్నాం మాకు అయిపోయింది అనడానికి లేదు. నిరంతర కృషి వల్లే వాళ్ళు ఆ స్థాయికి ఎదగగలరు. అందుకే ఇప్పుడు దానికి మన వేదాంతం నాలుగు విషయాలు చెప్పింది ఏమిటంటే ?

**1) నీటితో అవయవాలు శుభ్రపడతాయట:**

మనం రోజూ స్నానం చేస్తాం. ఇవేళ చేసామని రేపు మానేయం. అంటే స్నానం వల్ల మన శరీర అవయవాలు శుద్ధత్వం పొందుతాయి.

**2) సత్యాచరణ వల్ల మనసు శుద్ధి అవుతుందట:**

మరి సత్యాచరణ అంటే సత్యం తెలుసుకుంటూ మనం ఎప్పుడూ సత్యంలో జీవిస్తూ ఉంటే మనసు శుద్ధి అవుతుందట. అంటే ఏది చేస్తున్నా

పరమాత్మకు చేస్తున్నాను, ఏది స్వీకరిస్తున్నా పరమాత్మ దయ వల్ల స్వీకరిస్తున్నాను అని మీరు సత్యమైన ఆలోచన చేస్తూ, సత్యాచరణ చేస్తున్నప్పుడు, మీ మనసు శుద్ధత్వం పొందుతుంది.

**3) అలాగే విద్య చేత, తపస్సు చేత జీవాత్మ శుద్ధత్వం పొందుతుందట:**

అంటే మీరు శరీరంలోకి ప్రవేశించి మనసు యొక్క ప్రాబల్యంతో ఉంటున్నప్పుడు జీవాత్మ అంటారు. ఆ మనసు యొక్క ప్రాబల్యం తగ్గించు కుంటూ ఎప్పుడైతే నేను శరీరం కాదు నేను ఆత్మని అనే భావంలో ఉంటారో, ఆ స్థితిలో జీవిస్తారో మీరే పరమాత్మ అవుతారు. అందుకే ఇప్పుడు అందరినీ జీవాత్మ అంటారు. ఎందుకంటే మీరు ఇంకా మనసు ప్రభావంలో ఉన్నారు. మరి ఈ జీవాత్మ ఎప్పుడు శుద్ధత్వం పొందుతుంది అంటే? విద్య చేత, తపస్సు చేత శుద్ధత్వం పొందుతుంది.

అంటే ఈ బ్రహ్మ విద్య, ఆత్మవిద్యని నేర్చుకుంటూ, ప్రాపంచిక అవసరాలకు పరిమితమవుతూ అంటే శరీరానికి ఆహారం అవసరం కాబట్టి ఎంత కావాలో అంత తీసుకోవాలి, నిత్యము ఆత్మకి ధ్యానం అవసరం కాబట్టి అక్కర్లేని సోదులు వేసుకుంటూ కూర్చోవడం మాని ధ్యానం చేసుకోవాలి. అలా విద్య చేత, తపస్సు చేత జీవాత్మ శుద్ధత్వం పొందుతుంది.

**4) బ్రహ్మజ్ఞానం చేత బుద్ధి పవిత్రమవుతుంది:**

ఇప్పటివరకు మీరు విగ్రహారాధన చేస్తూ, పూజలు చేస్తూ నాకు స్వర్గలోకం వచ్చేసింది అనుకుంటూ వుంటారు కానీ, భూమి మీద సాధన చేసి, ఈ బ్రహ్మజ్ఞానం నేర్చుకోవడం వల్ల దానికంటే గొప్ప లోకమైన సత్యలోకం చేరుకోవచ్చని తెలుసుకోవాలి.

అందుకే మీరు ఈ భూమి మీద ఉండగానే ఈ బ్రహ్మజ్ఞానం, ఆత్మజ్ఞానం తెలుసుకుంటూ సాధన చేయాలి. ఊరికే వింటే పండితుల్లా ఉంటారు. మీరు చూస్తే ఎంతోమంది పండితులు ఎన్ని ప్రవచనాలు చెప్పినా, ఎన్ని పురాణాలు చెప్పినా, పరబ్రహ్మే ఈ సృష్టిని నడిపిస్తున్నాడు అని కానీ,

పరబ్రహ్మని చేరుకోవాలి అని కానీ, సత్యలోకాన్ని చేరుకోవాలి అని కానీ, మోక్షం కావాలి అంటే ధ్యానం చెయ్యాలి అని కానీ ప్రవచనకర్తలు ఎవ్వరూ చెప్పరు.

వాళ్ళు చెప్పకపోవడం వాళ్ళ లోపం కాదు. సత్యాన్ని అధ్యయనం చేసే శక్తి, చెప్పే శక్తి ఒక్క బ్రహ్మజ్ఞానికే ఉంటుంది. పవిత్రమైన హృదయంలో పరమాత్మకు స్థానం కల్పించాలి అంటే మీ నోటివెంట అసత్యం రాకూడదు, అపవిత్రమైన జీవితం మనం ఎప్పుడు గడపకూడదు. పర బ్రహ్మం గురించి మాట్లాడాలన్నా, చెప్పాలి అన్నా మీరు ఎంతో పవిత్ర జీవితం గడిపి, పవిత్రమైన మాటలు మాట్లాడితేనే ఆ సత్యాన్ని చెప్పే అర్హత వస్తుంది అని వేదాలు స్పష్టంగా తెలియజేశాయి.

అందుకే బ్రహ్మజ్ఞానం ఎంత గొప్పదో తెలుసుకున్నప్పుడు ఆ జ్ఞానాన్ని పొందడానికి మీరు కూడా ప్రయత్నిస్తారు. ఆ పరబ్రహ్మకు మీరు నచ్చబట్టే పత్రిగారి లాంటి గురువును పొంది ఈరోజు ఈ స్థితిలో ఉన్నారు. మరి ఆ పరమాత్మ కృప వల్ల బ్రహ్మ జ్ఞానం పొందితేనే మీ బుద్ధి పవిత్రంగా ఉంటుంది. అయితే పాప కర్మలన్నీ పోగొట్టుకోవడానికి ధ్యానం, మోక్షం పొందడానికి బ్రహ్మజ్ఞానం ఈ రెండు భూమిమీద ఉండగానే మానవుడు సాధించగలడు.

మరి ఈ సత్యం తెలుసుకున్న మీరు దానికోసమే ప్రయత్నిస్తూ, నిరంతర సాధన చేస్తూ, పవిత్రంగా జీవిస్తున్నారు. సృష్టిలో అందరూ కూడా పవిత్రంగా జీవించడానికి కావలసింది బ్రహ్మజ్ఞానమే అని తెలుసుకున్న మీకు చెప్పే అర్హత కూడా వస్తుంది. సాధన చేయకపోతే మళ్ళీ అర్హతని కోల్పోతారు.

మరి పత్రి గారిలా గొప్ప జీవితం జీవించాలి అంటే నిరంతర సాధన చేస్తూ, ప్రాపంచిక సౌఖ్యాల గురించి ఆలోచించకుండా పరలోకాలకు ఎలా వెళ్ళాలి? ఎంత తొందరగా వెళ్ళాలి? ఎంత ఎక్కువ నేర్చుకోవాలి? అనే దాని మీద ఎక్కువ దృష్టి పెట్టగలిగితే ఈ భూమిమీద ఉండగా కూడా ఆనందకరమైన జీవితం జీవిస్తారు.

# సుఖంగా, సంతోషంగా, హాయిగా జీవించాలంటే ఏం చేయాలి?

ప్రతి మానవుడు నేను సుఖంగా, హాయిగా, సంతోషంగా ఉండాలని కోరుకుంటాడు. వాటి కోసమే ఎన్నో ప్రయత్నాలు చేస్తాడు. ఆధ్యాత్మికతలోకి వచ్చినా కూడా ఎక్కువ ఈ మూడింటి గురించే ప్రయత్నాలు చేస్తూ ఉంటాడు. మరి ఈ విధంగా ఉండాలి అంటే భగవంతుడు సృష్టిలో ఏర్పాటు చేసిన ధర్మాన్ని పాటించాలి. అదేమిటంటే? నువ్వు సృష్టికి ఏమి ఇస్తే, సృష్టి నుంచి అవే పొందుతావు అని.

అంటే నువ్వు సుఖంగా ఉండాలంటే ఎదుటి వాళ్ళ సుఖం కోరుకోవాలి, నువ్వు హాయిగా బ్రతకాలంటే ఎదుటివారిని హాయిగా బ్రతక నివ్వాలి, నువ్వు సంతోషంగా ఉండాలి అంటే ఎదుటివారి సంతోషానికి నువ్వు సహకరించాలి.

ప్రాపంచిక జీవితంలో అలా అనుకునేవారు చాలా అరుదు. ఎవరికి వారు, వారే సుఖపడాలి, వారే ఆనందంగా జీవించాలి, వారే సంతోషంగా ఉండాలి అనుకుంటారు. మరి దానికి కారణం ప్రతి మనిషికి ఉన్న స్వార్థం. ఆ స్వార్థం వల్ల ప్రక్కవాళ్ళని పట్టించుకోరు. కానీ ఎప్పుడైతే మీరు సాధన చేస్తూ, వినయంగా ఉండి జ్ఞానం సంపాదిస్తారో  ఆ రకంగా జీవిస్తారు.

కానీ ప్రాపంచికంలో అహంకారం పోదు, వినయం రాదు. సాధన లేక తానే గొప్ప, తానే బాగుండాలనే కోరిక వల్ల ఇంకా ఇంకా దుఃఖంలో కూరుకుపోతూ ఉంటారు. కానీ ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చాక గురువులు మొట్టమొదటిదిగా శిష్యులకు నేర్పేది వినయం. ప్రాపంచిక జీవితంలో ఎప్పుడూ కూడా భయము, దుఃఖము రెండూ ఉంటాయి. తనకున్నది ఏదైనా సరే కాపాడుకోవడానికి ప్రయత్నిస్తారు, అది పోతుందేమో అని భయపడతారు.

తనవాళ్ళు తన దగ్గర నుంచి వెళ్ళిపోతే దుఃఖ పడతారు.

ఈ భయాలు కానీ, దుఃఖాలు కానీ చెడ్డ భావాలు. ఇవన్నీ కూడా మనసుకు ఉన్న దుర్గుణాలు. ఎన్ని పూజలు, వ్రతాలు, నోములు, యజ్ఞ యాగాదులు చేసినా మానవుల్లో ఈ దుర్గుణాలు పోవు. ఒక్క ధ్యాన సాధన వల్లే ఆ గుణాలు మార్చుకోవచ్చు. ఈ భూమిమీద సాధన లేకుండా ఏదీ సాధించలేరు. అందుకే "సాధనతో సమకూరు పనులు ధరణిలోన" అంటారు.

మరి ప్రపంచం వైపు తిరిగిన మనసు అపవిత్రమై, అవినీతికి అలవాటు పడుతుంది, దుర్గుణాలకు అలవాటు పడుతుంది. అపవిత్రత అంటే చెడు పనులు చేయడం, చెడుగా జీవించడం, అవినీతి అంటే ఎన్ని అడ్డదారులైనా తొక్కి డబ్బు సంపాదించాలి అనుకోవడం. ఇప్పుడు ప్రపంచమంతా ఇలాగే వుంది, వ్యాపారాల్లో అవినీతి, ఉద్యోగాల్లో అవినీతి, అన్నిట్లో అవినీతి కనిపిస్తుంది.

"దుర్గుణాలు" అంటే గత జన్మ చెడు సంస్కారాలు వదలక, అవి అలవాట్లుగా మారిపోయి మాంసం తింటే తప్పేంటి? మందు తాగితే తప్పేంటి? అంటున్నారు. ఈ అపవిత్రత, అవినీతి, దుర్గుణాలు ఉన్నన్నాళ్ళు ఆనందంగా జీవించలేరు.

మరి ఈ మూడు తొలగాలంటే ధ్యానం, స్వాధ్యాయం కూడా చేయాలి. సుఖము, సంతోషము, చక్కని జీవితము కావాలి అంటే ఈ భూమి మీద ఏ గుణాలైతే అలవాటుగా మారాయో అవన్నీ ధ్యానంతో తొలగించు కోవాలి.

మరి ఈ విధంగా చేస్తూ మనసును శుద్ధి చేసుకోవడానికి మంచి స్నేహితులను వృద్ధి చేసుకోవాలి. మీకు ఎవరైనా హితకరమైన మాటలు చెప్తే వాటిని స్నేహభావంతో స్వీకరించాలి. ఎక్కడ విరోధం ఉంటుందో దానిని తొలగించుకోవడానికి ప్రయత్నించాలి.

మొదట్లో మనం చెప్తే వినరు కానీ మీరు పదే పదే చెప్పడం వలన అవతలి వాడు మారొచ్చు. బయట వారు మీ మాటలు వినే అంత శక్తిపరులు మీరు కావాలి.

ఇప్పుడు పక్షులు చూడండి వాటి ఇల్లు అవే కట్టుకుంటాయి, చీమ తన ఆహారాన్ని తానే తెచ్చుకుంటుంది. వాటికి తెలివితేటలు లేవంటారా? ఇలా చూస్తే అన్ని జీవులు కష్టపడతాయి. ఎదుటివాడివి దోచుకోవాలని చూడవు, ఆశించవు. కానీ మానవుడే ఎదుటి ప్రాణిని చంపి, మాంసం తిని, తానేదో బలం తెచ్చుకోవాలనే కోరికలతో హింస చేస్తున్నాడు.

మరి పాపం మితిమీరినప్పుడు పరమాత్మే ఏదో ఒకరూపంలో శిక్షిస్తాడు. అలా శిక్షలు అనుభవిస్తే సుఖ, సంతోషాలు ఎలా ఉంటాయి? ఆలోచించండి!

అందుచేత "శ్వాస మీద ధ్యాస" సాధన చేసి విశ్వశక్తిని తీసుకొని మీలో ఉన్న పరమాత్మకి అర్పణ చేయాలి. మరి కొంచెమైనా కష్టపడకపోతే ఆనందం అనేది రాదు. ప్రాపంచిక ధనం వల్ల వస్తువులు రావచ్చు కానీ, ఆనందం అనేది సాధన వల్లే వస్తుంది. మీరు అందరినీ ఆనందింప చేయాలి అంటే హింసా మార్గం నుండి అహింసా మార్గానికి రావడం మొదటి మెట్టు అయితే, పరోపకారం చేయడం రెండో మెట్టు, సాధన, స్వాధ్యాయం చేసి విచారణ చేసుకోవడం మూడవ మెట్టు.

ఈ మూడు ఉంటేనే అద్భుతమైన, ఆనందకరమైన జీవితం జీవించ గలరు. మోక్షం రావడం అంటే నిత్యమూ ఆనంద స్థితిలో ఉండడమే. ఎప్పుడు మనసుని ప్యూరిటీగా ఉంచుకుంటారో అప్పుడు ఆత్మ దర్శనం కలుగుతుంది. మనసు ప్యూరిటీ అయి అద్వైతంలో జీవిస్తున్నప్పుడు ఆనందంగా జీవించ గలుగుతారు. మరి మీరు సుఖంగా, సంతోషంగా, హాయిగా ఉండాలి అంటే ఈ సృష్టిలో ప్రతి వాళ్ళని అలా ఉండనివ్వాలి.

# సంపదలు చూసుకుని సంబరపడడం కాదు, జ్ఞానం పొందినప్పుడు సంబరపడాలి

మానవులు ఉన్నత స్థితికి ఎదగాలి అని ఎన్ని వింటున్నా, ఎన్ని చేస్తున్నా మధ్యలో తెలియకుండానే మాయకి వశమై ఆ మాయ నుంచి తప్పించుకోలేక క్రిందకి పడిపోతూ ఉంటారు. అందుకే నిత్యం ధ్యానము చేస్తూ, జ్ఞానాన్ని వింటూ, మళ్ళీ మళ్ళీ రోజూ మననం చేసుకుంటూ ఉండాలి.

ఎందుకంటే? నిత్యం మన శరీరానికి ఆహారం ఎలా అవసరమో అలాగే ఆత్మకి ఆ ప్రాణ శక్తి అంత అవసరం. మరి ఈ విధంగా మీరు నిత్యమూ సాధన వల్ల, శ్రవణం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకుంటారు. చాలామంది మిమ్మల్ని అడుగుతూ ఉంటారు. ఎన్నాళ్ళు వింటారు? ఎన్నాళ్ళు నేర్చుకుంటారు? అని. మరి బ్రతికినన్నాళ్ళు ఆహారం ఎంత ముఖ్యమో! ఒక ఆత్మజ్ఞానికి భూమిమీద ఉన్నన్నాళ్ళు సాధన, జ్ఞానం రెండూ అవసరమే అని తెలుసుకోవాలి. ఇంకా ప్రశ్నలు వేస్తున్నాడు అంటే వాడికి అజ్ఞానం వదలలేదు అని అర్థమవ్వాలి.

మీరు ఈ మార్గంలోకి రాకముందు ఎలా బ్రతికినా, ఆధ్యాత్మిక జీవితంలోకి అడుగు పెట్టి అన్నీ తెలుసున్నాక చాలా జాగ్రత్తగా నేను ఎక్కడైనా మాయకి వశం అవుతున్నానా? అని ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి. మరి మాయకి వశమైన మానవుడు ఎలా ఉంటాడంటే! అహంకారంతో, గర్వంతో, కోరికలతో ఉంటాడు. కనిపించేవి ఏవి పెరుగుతున్నా అంటే పదవి పెరిగినా, విద్య పెరిగినా, సంపదలు పెరిగినా, ఇంకా అహంకారం పెరిగిపోతూ ఉంటుంది.

అందుకే మహాత్ములు కానివ్వండి, గురువులు కానివ్వండి, మనకంటే ముందు సాధన చేసి, గొప్ప జ్ఞానాన్ని పొందిన గొప్పవాళ్ళు కానివ్వండి ఆత్మజ్ఞానికి అహంకారం ఉండకూడదని ఎన్నో ఉపమానాలతో చెప్తారు. మరి

కొంతమంది మహాత్ములు **"సంపదల వల్ల సంబరపడడం కాదు, జ్ఞానం వల్ల సంబరపడాలి"** అని చెప్పారు. అంటే కొంతమంది సంపదలు వస్తున్నాయని సంబరపడుతూ, అహంకారాన్ని పెంచుకుంటూ, ప్రక్కవాళ్ళని చులకన చేస్తారు, అలాగే మరి కొంతమంది వంశ పారంపర్యంగా వచ్చిన సంపదలు కూడా తానే సంపాదించినట్టు అహంకరిస్తూ ఇంకా క్రిందకి దిగజారుతూ ఉంటారు.

అదే ఒక ఆత్మజ్ఞాని రోజూ సాధన చేస్తూ, రోజూ జ్ఞానం వింటూ ఏదైనా ఒక కొత్త విషయం తెలుసుకున్నప్పుడు సంబరపడుతూ ఉంటాడు. మీరు గమనించండి ఒక్కొక్కసారి కొత్త విషయాలు విన్నప్పుడు అరే! నేను ఈ కోణం నుంచి ఆలోచించలేదే అని మీకే ఆశ్చర్యం వేస్తూ ఉంటుంది. ఎందుకంటే మీరు తెలుసున్నదే కరెక్ట్, ఎదగడానికి అదొక్కటే మార్గం అనుకుంటారు. మరి మీ ముందు ఒక్కటే మార్గం అయితే! ఇంతమంది, ఇన్ని పుస్తకాలు ఎందుకు తీసుకొస్తారు?

ఎన్ని విధాలుగా చెప్తున్నా మీరు జ్ఞానంలో స్థితం అవ్వలేరు. ఎందుకంటే పరమాత్మ కనిపించడు, ఆయన సృష్టి మాత్రమే కనిపిస్తుంది. అందుకే మీకు మనసు ఉంది కాబట్టి అనుక్షణం మాయకి వశమయ్యే భూమిమీద ఉన్న ప్రతీదీ కోరుకుంటూ, కోరికలకు బానిసలై, ఉన్న సంపదలు చూసుకుంటూ, అహంకారాన్ని పెంచుకుంటూ, మానవ జన్మ ఉద్దేశ్యం ఏమిటో తెలుసుకున్నా మర్చిపోతూ ఉంటారు.

అందుకే నిత్యం సాధన, శ్రవణం తప్పకుండా సాధకుడికి ఉండే తీరాలి. ముఖ్యంగా శంకరాచార్యులు భజగోవిందంలో ఏం చెప్పారంటే!

**మా కురు ధన జన యౌవన గర్వం**
**హరతి నిమేషత్కాలః సర్వం**
**మాయా మయ మిద మఖిలం భూత్వా**
**బ్రహ్మ పదం త్వం ప్రవిశ విదిరత్వా**

అర్థం: – నాకు ఇంత ధనం వుందని, నాకు ఇంతమంది పరివారము, అండగా వున్నారని, నేను మంచి యవ్వనంలో శక్తి సామర్థ్యాలతో తులతూగు తున్నానని, ఇవన్నీ ఉన్నాయని గర్వపడకు. అవన్నీ ఒక్క నిమిషంలో వెళ్ళిపోతాయి. ఒక్కొక్కసారి క్షణకాలంలో పోవచ్చు ఇదంతా మాయే. మరి ఈ మాయని జయించాలి అంటే ఏం చేయాలి? అవన్నీ అశాశ్వతం అనుకుంటూ, ఇదంతా మాయే అని తెలుసుకుంటూ జ్ఞానివై పరబ్రహ్మను స్మరించు అన్నారు శంకరాచార్యుల వారు.

అంటే ఈ భూమిమీద ఉన్న సంపదలన్నీ నశించేవే! కానీ నశించని సంపద పరమాత్మ సన్నిధే అని ఎప్పుడైతే తెలుసుకుంటావో వీటిని చూసుకుని, ఇవి ఉన్నాయని గర్వపడవు.

ఉదాహరణకి దుర్యోధనుడిని తీసుకుంటే వంశ పారంపర్యంగా వచ్చిన సంపదలను చూసుకుని అహంకారం పెంచుకున్నాడు. చిన్నప్పుడు పాండవులతో స్నేహంగా ఉన్నా ఈ రాజ్యం మాది, మేము చక్రవర్తులము అని అహంకారం పెంచుకుంటూ.. అసలైన వారసులైన పాండవులతో విరోధం తెచ్చుకున్నాడు. చివరికి ఆ సంపదలన్నీ కోల్పోవలసి వచ్చింది. అవి క్షణకాలంలో పోతాయి అని శంకరాచార్యులు చెప్పడానికి కారణం అదే!

ఇవన్నీ ఉన్నాయని గర్విస్తున్నావు కానీ అవన్నీ మాయే! అసలు సృష్టే మాయ! అందుకే 'ఆత్మ సత్యం జగత్ మిథ్య' అని ఎన్నో సార్లు మనం ఎన్నో విధాలుగా తెలుసుకుంటూనే ఉన్నాం. తెలుసుకున్నా మాయలో పడిపోతూనే ఉన్నారు. ఇది మాయ అని ఆ క్షణంలో మీకు ఎరుక రాదు. ఎందుకంటే? దీనికి శంకరాచార్యులు ఒక విషయం చెప్తూ ఉంటారు. అర్హత ఉన్న వాళ్ళకి రెండు రకాలుగా పరీక్షలు ఉంటాయట.

అర్హత ఉన్న వాళ్ళకి పరబ్రహ్మ కష్టాలనిచ్చి, ఆ కష్టాలను జయిస్తే తన దగ్గరికి చేర్చుకుంటాడట. మరి అర్హత లేని వాళ్ళకి సంపదలు ఇచ్చి,

వాళ్ళని మాయలో పడేసి, అవే కరెక్ట్ అనుకునేటట్టు భ్రాంతిని కల్పించి, ఇంకా ఇంకా వెనక్కి వెళ్ళిపోతూ ఉండేలా చేస్తాడట. చూడండి మీరు ఎదగాలంటే ప్రపంచంలో ఉన్నా పరీక్ష వుంటుంది. లేదు ధ్యానంలో ఉన్నా పరీక్ష వుంటుంది. రెండూ పరీక్షలే అని తెలుసుకోగలగాలి. ప్రాపంచిక జీవితాన్ని ఇష్టపడిన వాడు ఆ సంపదలను చూసుకుని మురిసిపోతాడే కానీ పరమాత్మ యొక్క విలువ మర్చిపోతూ ఉంటాడు.

కానీ ఆధ్యాత్మిక జీవితం జీవించేవాడు ఎన్ని సంపదలు ఉన్నా పరమాత్మను ఎప్పుడూ మర్చిపోడు. అందుకే బలి చక్రవర్తి దగ్గరికి విష్ణుమూర్తి వామనుడిగా వచ్చినప్పుడు తన గురువు శుక్లాచార్యుడు చెప్తాడట ఆయన ఏ దానం అడిగినా నువ్వు ఇవ్వద్దు, ఆయన నిన్ను సంహరించడానికే వస్తున్నాడు అని. మరి అలా చెప్పినప్పుడు బలి చక్రవర్తి ఏం చెప్పాడంటే?

ఎందరో రాజులు భూమి మీదకు వచ్చి ఎన్నో సంపదలు పొందారు, ఎందరో చక్రవర్తులు ఈ భూమిని ఏలారు, ఎవరి పేరు శాశ్వతంగా ఉంది? ఈ పేరు ప్రతిష్టల కంటే, ఈ సంపదల కంటే, ఈ రాజ్యాల కంటే, పరమాత్మ నా ముందు చెయ్యి చాచి అడిగినప్పుడు నేను చనిపోయినా, నా జీవితం అయిపోయినా నేను ఆయనకి శరణాగతి అవుతాను అన్నాడు. మరి గురువు హెచ్చరించినా వినకుండా దానం ఇచ్చాడు.

మామూలు మరణం గొప్ప కాదు. పరమాత్మ చేతిలో మరణం ఎంతో గొప్ప అని ఆయన నిర్ణయం తీసుకుని దానం ఇవ్వడానికే ఆయన నిర్ణయించుకున్నాడు. అందుకే చరిత్రలో శాశ్వతంగా మిగిలిపోయాడు. కానీ నేను చక్రవర్తిని అని ఆయన పరమాత్మని మర్చిపోలేదు. అందుకే రాక్షస కులంలో పుట్టిన ప్రహ్లాదుడు కానీ, బలి చక్రవర్తి కానీ చాలా గొప్పగా చరిత్రలో మిగిలి పోయారు.

మరి ఎంతో మంది రాక్షసుల్ని మనం తక్కువగా చూస్తూ ఉంటాం. ఎవరైనా సరిగ్గా ప్రవర్తించకపోతే రాక్షసుడు అంటాం. మరి రాక్షస జాతిలో

పుట్టినా మంచి గుణాల వల్ల వాళ్ళు దేవతా స్వభావం పొందారు. మరి ఎవరైనా సరే భూమిమీద సాధన చేసినప్పుడు గొప్పగా ఎదగాలి. మరి గొప్పగా ఎవరు ఎదగగలరు అంటే? పరమాత్మ గురించి ధ్యానం చేస్తూ ఆయన సన్నిధిలోకి చేరుకోవాలనుకునే వాళ్ళు మాయని జయిస్తారు, కష్టాలను జయిస్తారు, గొప్పగా ఎదుగుతారు. అహంకారి మాత్రమే మాయను జయించలేడు అని ఇక్కడ అర్థం చేసుకోవాలి.

రామకృష్ణ పరమహంస **"ఈ సృష్టిలో నేనే కాదు, నన్ను మించిన గొప్పవాళ్ళు ఎప్పుడూ ఉంటారని తెలుసుకోవాలి"** అని తన శిష్యులకి ఎప్పుడూ బోధిస్తూ ఉంటారట. ఇది ప్రతీ ధ్యాని తెలుసుకోవాల్సిన ముఖ్యమైన విషయం. మీరే గొప్పవాళ్ళు కాదు మిమ్మల్ని మించిన గొప్పవాళ్ళు ఈ సృష్టిలో ఎప్పుడూ ఉంటారు. మీకంటే జ్ఞానులు ఉండొచ్చు, మీకంటే దానం చేసేవాళ్ళు ఉండొచ్చు, మీకంటే లోకానికి ఉపయోగపడే వాళ్ళూ ఉండొచ్చు. అందుకే మీరే గొప్పవాళ్ళని ఎప్పుడు అహంకారం పెంచుకోవద్దు అని రామకృష్ణ పరమహంస శిష్యులకి బోధిస్తూ ఒక చిన్న ఉదాహరణ కూడా చెప్పారట. అది చెప్పుకుందాం.

మిణుగురుపురుగులు చీకటి పడగానే బయటికి వచ్చి వాటి కాంతిని వెదజల్లుతాయి.. ప్రతి పురుగు సాయంత్రం అయ్యేటప్పటికి దూరం నుంచి చూస్తే నిప్పురవ్వలాగా కనిపిస్తూ ఉంటుంది. మరి ఆ మిణుగురు పురుగులు మేమే లోకానికి కాంతిని ఇస్తున్నాము అని అనుకుంటాయట. అనుకున్న క్షణంలో వెంటనే ఆకాశంలో నక్షత్రాలు కనబడతాయట. అప్పుడు మిణుపురుగుల యొక్క కాంతి వెలవెల పోతుందట. అంటే వాటి కంటే గొప్ప నక్షత్రాలు వచ్చేసాయి అని తెలుసుకుంటాయి.

మరి నక్షత్రాలు ఆకాశంలో మెరుస్తున్నప్పుడు అవి కూడా అనుకుంటాయట మేమే ఈ లోకానికి కాంతినిస్తున్నాము, మా వల్లే కాంతి వస్తుంది అని. అవి అలా అనుకుని అహంకారం పెంచుకునే లోపల చంద్రుడు

వస్తాడట.

చంద్రుడు వచ్చి తన చల్లదనాన్ని, వెన్నెల్ని ఇస్తూ.. నేను లోకానికి ఎంతో చేస్తున్నాను అని అనుకుంటాడట. అనుకున్న కాసేపటికే సూర్యుడు వస్తాడట. సూర్యుడి యొక్క వెలుతురు ముందు ఇవన్నీ వెలవెల పోతాయట. ఆయన కాంతి ముందు ఏ కాంతి అయినా వెలవెలపోతుంది.

సూర్యుడు ప్రపంచానికి వెలుగిస్తాడు. అందుకే దివ్యమానవుడ్ని సూర్యుడితో పోలుస్తారు. రామకృష్ణ పరమహంస ఇది చెపూ్త మనం కూడా ఒక సూర్యుడిలాగా ప్రజ్వరిల్లాలి కానీ చిన్న శక్తికే అహంకారం పెంచుకుంటే ఉన్నవి వెనక్కి తీసుకోబడతాయి అని చెప్పేవారు. కనుక మీ కన్నా గొప్పవారు ఈ లోకంలో ఉంటూనే ఉంటారు అని మర్చిపోకూడదు.

పరబ్రహ్మని పొందడమే పరమజ్ఞానము అని తెలుసుకోలేని బుద్ధిహీనులే ఈ లోకంలో ఉన్న సంపదలను చూసి, బంధువులు, బలగాన్ని చూసి అహంకరిస్తారు. కానీ ఆ పరబ్రహ్మని పొందితే ఉన్న ఆనందం మిగతా వేటి వల్ల కూడా రాదు. అందుకే సంపదలను చూసి మురిసిపోకు, సంపదలను చూసి సంబరాలు చేసుకోకు. జ్ఞానం పొందిన రోజున, నువ్వు దివ్య మానవుడిగా ఎదగగలిగిన రోజున సంబరపడు అన్నారు.

మరి ఎప్పుడు మీరు దివ్య మానవులు అవుతారంటే? ఆత్మను దర్శించినప్పుడు, ఈ బ్రహ్మాండాన్ని తెలుసుకోగలిగినప్పుడు దివ్య మానవులు అవుతారు. పత్రి గారు ఎప్పుడూ నువ్వు ఒక కో–క్రియేటర్ కావాలి అని చెప్తారు. సృష్టికి ప్రతి సృష్టి చేయగలిగే శక్తి ఉన్నప్పుడు మీకు బ్రహ్మజ్ఞానం వచ్చినట్లే. మరి అంత శక్తి సంపాదించవలసిన లక్ష్యం మీ ముందు ఉన్నప్పుడు ఈ చిన్ని చిన్ని నశించిపోయే సంపదలు కానీ, నశించిపోయే ఈ భూమి మీద ఉన్న విద్యలు కానీ, ఏవైనా సరే చూసి ఇంకా నువ్వు గర్వపడితే నీకు అసలైన జ్ఞానం పొందే వీలు కూడా పోతుంది.

ఈ భూమి మీదకు వచ్చాక మీ గమ్యం ఏమిటి? మీ లక్ష్యం ఏమిటి? అన్నది పత్రిగారు నేర్పించారు, నేర్పి వదిలేయలేదు. ఆయన మీ చేత నిరంతరము సాధన చేయించారు, శ్రవణం చేయించారు, స్వాధ్యాయమూ చేయించారు, అది మీకు మననం అవ్వడానికి పది మందికీ పంచు అన్నారు. ఎప్పుడైతే మీరు 10 మందికీ పంచుతారో ఆ జ్ఞానం ప్రపంచంలోకి విస్తరిస్తుంది. అందుకే అందరికీ చెప్పండి అని చెప్పారు.

మీరు మాస్టర్ గా ఎదగడానికి ఎన్నో పుస్తకాలు చదువుతున్నారు, గురువుల బోధలు వింటున్నారు, కానీ దానికన్నా ముందు మనసు శుద్ధత్వం పొందాలి. దానికి నిరంతర సాధన అవసరం.

ఎందుకంటే ఇప్పుడు చూడండి. ఒక వస్త్రం మీద ప్రింట్ వేయాలి అంటే ముందు ఆ వస్త్రాన్ని శుభ్రం చేస్తారు. తెల్లగా శుభ్రం చేశాకే ప్రింట్ వేస్తారు. లేకపోతే ఆ ప్రింట్ సరిగ్గా కనబడదు. అలాగే మీ మనసు ప్రపంచం వైపు తిరిగి మురికిని పోగేసుకుంటుంది. ఏ మురికి? ఆశ అనే మురికి, స్వార్థం అనే మురికి. మరి రోజూ సాధన వల్ల మీరు ఆ మనసుకు పట్టిన మురికిని వదుల్చుకోవాలి. వదుల్చుకుని మనసుని తెల్ల పేపర్‌లాగా శుద్ధత్వంలో ఉంచుకున్నప్పుడు గురువులు చెప్పింది కానీ, ఆత్మజ్ఞానం పొందిన మాస్టర్స్ చెప్పిన విషయాలు కానీ మీలో ఇంకిపోతాయి. మరి మీరు ఇంకొకళ్ళకి చెప్పినప్పుడు ఇంకా ముందుకి ఎదుగుతారు.

అసలు మీరు ఎందుకు ఎదగాలి? అంటే మానవ జన్మ పరమార్థం, ఈ దేహం ఉండగానే దేహాన్ని సృష్టించిన వాడిని తెలుసుకోవడం. అలా తెలుసుకోకపోతే తెలుసుకోనే వరకు మీరు జన్మలు తీసుకుంటూనే ఉండాలి. జన్మ అంటే మళ్ళీ బాధలు, కష్టాలు, కన్నీళ్లు, కోరికలు, అహంకారాలు, మమకారాలు, కొంతసేపు సుఖం, కొంతసేపు కష్టం, కొంతసేపు దుఃఖం, కొంతసేపు సంతోషం వుంటాయి.

అందుకే ఇవన్నీ లేకుండా శాశ్వతమైన ఆనందం పొందాలి అంటే భూమి మీద సృష్టించబడిన ప్రతి జీవి మానవ జన్మ తీసుకుని అంతిమ లక్ష్యమైన పరమాత్మను తెలుసుకోవాలి. మీ గమ్యమైన సత్య లోకం చేరుకోవాలి. మరి ఈ విషయం ఈ మార్గంలోకి వచ్చి మీరు తెలుసుకున్నారు కాబట్టి ఆ లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నించాలి.

చూడండి ఇప్పుడు ప్రాపంచిక చదువుల్లో మంచి మార్కులు రావాలి అంటే మంచి ర్యాంక్ రావాలి, మనం అనుకున్న దాంట్లో సీట్ రావాలి అంటే ఆ విద్యార్థి చాలా కష్టపడతాడు, రాత్రి, పగలూ చదువుతాడు, స్పెషల్ కోచింగ్ తీసుకుంటాడు, ఎన్నో మెలకువలు నేర్చుకుంటాడు, నేర్చుకొని కావలసిన సీటు సంపాదించుకుంటాడు.

అలాగే సత్యలోకవాసులమైన మీరు కూడా భూమిమీదకు వచ్చి మళ్లీ తిరిగి అక్కడికి చేరుకోవడానికి నిత్యము సాధన, సజ్జన సాంగత్యం, స్వాధ్యాయము తప్పనిసరిగా చేసినప్పుడు ఎన్నో విషయాలు తెలుసుకుంటూ ముందుకు వెళ్తారు. అహంకారం అనేది నాలుగు అక్షరాలు మాట కానీ అదే మిమ్మల్ని క్రిందకి దిగజార్చడానికి పెద్ద కారణం అవుతుంది. మీకు మమకారం అయినా తక్కువ ఉంటుంది, కానీ అహంకారం అనేది అందరికీ ఎక్కువే ఉంటుంది.

అందుకే సంపదల వల్ల కానీ, పరివారం వల్ల కానీ, వచ్చేవన్నీ క్షణకాలం ఉంటాయి అని తెలుసుకో అని శంకరాచార్యులు చెప్పారు. ఇవి క్షణకాలంలో పోవచ్చు. మరి దుర్యోధనుడు ఎంత అహంకరించినా తాను మరణించాక ఏం పట్టుకెళ్ళాడు? ఏదీ పట్టుకెళ్లలేదు. అహంకారంతో కృష్ణ పరమాత్మ ప్రక్కనే ఉన్నా గుర్తించలేకపోయాడు. అహంకారంతో కృష్ణుడి మాటల్ని పెడచెవిన పెట్టాడు.

అలా మీరు కూడా అక్కర్లేని విషయాలు వినేకంటే గురువు చెప్పిన

కొన్ని హిత వాక్యాలు వింటే ఎంతో ఉన్నత స్థితికి చేరుకుంటారు. గమనించండి పత్రిగారు మూడు ముక్కల్లో సింపుల్ గా చెప్పారు. **"ధ్యానం వల్లనే జ్ఞానం, జ్ఞానం వల్లనే మోక్షం"** అని.

నీకు మోక్షం కావాలంటే ధ్యానం చెయ్యి అన్నారు. వినికిడి జ్ఞానం, పుస్తక జ్ఞానం నువ్వు తెలుసుకున్నా నీలో స్థితం అవ్వాలి అంటే "శ్వాస మీద ధ్యాస" అనే ధ్యానం ఉండాల్సిందే! మీరు ఎక్కడ మర్చిపోతారో అని ధ్యానం అంటే "శ్వాస మీద ధ్యాస" అని ఎన్నో బోర్డులు పెట్టించారు. మరి ఇవన్నీ తెలుసుకున్న మీరు అహంకారాన్ని పెంచుకుంటూ..సంపదలు ఉన్నాయని సంతోషిస్తూ.. సంబరాలు చేసుకోవడం కాదు.

సంపదలు పెరిగే కొద్ది ప్రతిదానికి ఫంక్షన్లు చేసుకుంటారు. పుట్టిన రోజు, పెళ్లి రోజు, మనవడు పుట్టిన రోజు, కొడుకు పుట్టిన రోజు, వాళ్ళవి, వీళ్ళవి బోలెడు సంబరాలు ఉంటాయి. మరి ఇలాంటి సంబరాలు చేసుకోవడం కాదు. జ్ఞానం పెరిగిన రోజున, నువ్వు ఒక ఆత్మజ్ఞానవి, బ్రహ్మజ్ఞానవి అయిన రోజున సంబరం చేసుకోవాలి.

మరి మీకు జ్ఞానం పెరిగింది అనడానికి గుర్తు ఏమిటంటే? నేర్చుకునే వాళ్ళని ప్రకృతే మీ ముందు పెడుతుంది. పత్రి గారు చెప్తూ ఉండేవారు. నీ ముందు ఎంతమంది కూర్చున్నారో నీ శక్తి అంత ఉందని నువ్వు లెక్కేసుకో అనేవారు. ఈరోజు పది మందే వచ్చారు అంటే అదే నీ శక్తి. 100 మంది రావాలని నువ్వు కోరుకుంటే అంత శక్తి నువ్వు సంపాదించిన రోజున ప్రకృతే నీ ముందు అంతమందినీ కూర్చోబెడుతుంది. ప్రకృతికి ఏ పక్షపాతమూ లేదు.

అంతేకానీ నేను క్లాస్ కి వెళ్ళాను, జనం తక్కువ వచ్చారు అనుకుంటే అది జనం లోపం కాదు, నీ శక్తి లోపం. అందుకే ధ్యానం పెంచుకో, ధ్యాన శక్తిని పెంచుకో, జ్ఞాన శక్తిని పెంచుకో, అప్పుడే నువ్వు చెప్పే జ్ఞానాన్ని వినడానికి ఎంతో మంది వస్తారు. ఇక్కడ వాళ్ళ లోపం, వీళ్ళ లోపం కాదు, ఆ లోపం

నీలోనే ఉంది. సృష్టిలో ఏ లోపము లేదు, నీ దృష్టిలోనే లోపం ఉంది. నువ్వు ఎదిగాను అనుకుంటున్నావు కానీ నిజంగా నువ్వు ఎదిగితే ప్రకృతే నీ ముందు జనాన్ని కూర్చోబెడుతుంది.

ఎప్పుడూ ఎదిగిపోయానని సంబరపడకు. ఎదగాలి ఎదగాలి అనే నీ కోరిక నిరంతరం ఉన్నప్పుడు నువ్వు ఎదగడానికే ప్రయత్నిస్తావు అని పత్రి గారు ఎప్పుడూ చెప్తూ ఉండేవారు. ప్రపంచంలోనివన్నీ కూడా నీకు అహంకారం పెంచడానికే నీ చుట్టూ ఉంటాయి. కానీ ఆ మాయలో పడకూడదు.

పత్రి గారు చనిపోయే ముందు కూడా చివరిసారి మా ఇంటికి వచ్చి వెళ్తూ వెళ్తూ వెనక్కి వచ్చి నువ్వు ఎప్పుడూ మాయలో పడకు అని మూడు సార్లు చెప్పి కారు ఎక్కి వెళ్ళిపోయారు. అదే ఆయన ఆఖరి సారిగా పర్సనల్ గా నాతో మాట్లాడిన మాట. నేను అప్పుడు అది అంత సీరియస్ గా తీసుకోలేదు. నేనెందుకు మాయలో పడతాను! అనుకున్నాను.

కానీ మన చుట్టూర మాయ ఎన్ని విధాలుగా వస్తుంది అని శంకరాచార్యులవారు భజగోవిందంలో ఈ శ్లోకంలో చెప్పారు. ధనం వల్లా, పరివారం వల్లా యవ్వనం వల్లా మనకి అహంకారం రావచ్చు. నేను ఖర్చు పెడుతున్నాను అని రావచ్చు, లేదా మీ క్లాసులకు వచ్చిన జనం మిమ్మల్ని పొగుడుతున్నారని రావచ్చు, లేదా నేను ఇన్ని తిరగగలుగుతున్నాను అనీ రావచ్చు. కానీ ఇవన్నీ మాయ, ఇవి ఒక్క క్షణంలో పోవచ్చు.

అందుకే ప్రపంచంలో నువ్వు ఎంత గొప్ప స్థాయికి వెళ్ళినా ప్రతి నిమిషం నీ మనసులో ఇదంతా మాయ, ఈ జగత్తే మాయ అని తెలుసు కున్నప్పుడు, ఇవన్నీ మాయలో భాగాలే అనుకున్నప్పుడు మీరు సంపదలు చూసి సంబరాలు చేసుకోరు, జ్ఞానం పెంచుకున్న రోజున సంబరాలు చేసుకుంటారు.

# ఆధ్యాత్మిక జీవితంపై ఎందుకు దృష్టి పెట్టలేకపోతున్నారు?

ప్రతి ఒక్కరు తెలుసుకోవలసింది ఆధ్యాత్మిక జీవితం వల్లే మానవుడు పూర్ణత్వం పొందుతాడు. మరి అమరత్వం పొందడానికి మానవజన్మే అనుకూలమైన జన్మ. ఎందుకంటే మానవ జన్మలోనే అమరత్వం అంటే ఏంటి? ఆధ్యాత్మిక మార్గంలో అది ఎలా సాధించగలం? అని చెప్తారు.

అందుకే ప్రాపంచిక జీవితం ఒక్కటే జీవిస్తే అసంపూర్ణ జీవితం. ప్రాపంచిక జీవితంతో ఆధ్యాత్మిక జీవితం కూడా స్వీకరిస్తే అమర జీవితం పొందవచ్చు అని చెప్తారు.

చాలామంది అమరత్వం అంటే చనిపోవడం అనుకుంటారు. కానీ కాదు, అది చాలా గొప్ప జీవితం, పరిపూర్ణమైన జీవితం. అందుకే మహాత్ములు ఏం చెప్తారంటే? అమరత్వ జీవితం పొందడానికి ఈ భూమిమీద ఆధ్యాత్మిక మార్గము, మానవ జన్మ ఈ రెండు ఉంటేనే వాళ్ళు పైలోకాల్లోనూ, ఈ లోకంలో కూడా చాలా గొప్పగా, ఆనందంగా జీవించగలరు అని చెప్తూ ఉంటారు.

మరి భగవంతుని గురించి తెలుసుకునే జీవితాన్నే ఆధ్యాత్మిక జీవితం అంటారు. ప్రాపంచిక జీవితం అంతా భగవంతుడు ఇచ్చేవి అనుభవిస్తూ, అదే ఆనందం అనుకుంటూ పరిమిత సంతోషం, పరిమిత సుఖాలు, పరిమిత ఆనందం పొందుతూ, ఒక్కొక్కసారి ఆ భోగాల మీద విసుగు చెందుతూ, మధ్యలో దుఃఖం కూడా అనుభవిస్తున్నారు.

వాళ్ళు కొన్ని జన్మలు ఆ రకమైన జీవితం జీవించాక ఒక గురువువల్లో, స్నేహితులవల్లో, ఎవరో ఒకళ్ళ వల్ల ఈ ఆధ్యాత్మిక జీవితం గురించి తెలుసుకుని ఇందులో జీవించడానికి ముందుకు వస్తూ ఉంటారు. మరి ఈ ఆధ్యాత్మిక జీవితం ఎంత గొప్పదో తెలుసుకున్నా, దీనివల్ల ప్రపంచంలో వచ్చే లాభము

తెలుసుకున్నా దీంట్లో కొంతమంది శ్రద్ధ పెట్టలేరు. మరి ఇదే శాశ్వతమైన ఆనందం ఇవ్వగలదు అని తెలుసుకున్నా కూడా దీని మీద దృష్టి ఎక్కువగా పెట్టలేకపోవడానికి కారణం ఇవాళ తెలుసుకుందాం.

1) చిన్నప్పటి నుంచి వాళ్ళు పెరిగిన వాతావరణంలో ఆధ్యాత్మిక పరిజ్ఞానం లేక అంటే కొంతమంది జీవితాల్లో చూసుకుంటే తల్లిదండ్రులకి ఈ ఆధ్యాత్మిక జీవితం యొక్క గొప్పతనం తెలుసుకునేటంత పరిజ్ఞానం ఉండదు. వాళ్ళకు ఆ జ్ఞానం లేక వాళ్ళ పిల్లలకు కూడా ఏమీ చెప్పరు. మరి ఆధ్యాత్మికతే తెలియని పరిసరాలలో పెరిగిన పిల్లలు అవేమి తెలియక కనబడుతున్న సృష్టినే చాలా గొప్పది అనుకుంటూ ఉంటారు.

ఆ పరిజ్ఞానం ఉన్నవాళ్ళు భగవంతుడి యొక్క గొప్పతనాన్ని తెలుసుకుంటారు. మరి ఈ భూమిమీద ఎన్ని పొందినా సుఖము, సంతోషము కలగొచ్చు కానీ శాశ్వతమైన ఆనందం కలగదు. ఆ శాశ్వతమైన ఆనందం పొందాలి అంటే ఆధ్యాత్మిక జీవితం వల్లే సాధ్యం అని తెలుసుకునే పరిజ్ఞానం తల్లిదండ్రులకి లేక ఆ పిల్లలు కూడా తెలుసుకోరు.

ఇప్పుడు ఎంతోమంది 99% ఆ జ్ఞానం లేకే ఈ భూమండలంలో దుఃఖం అనుభవిస్తున్నారు, శాంతి లేకుండా జీవిస్తున్నారు, ఆందోళనతో బ్రతుకుతున్నారు. బయటికి అందరూ బాగానే వున్నట్టు కనిపిస్తారు, కానీ ప్రతి నిమిషం ఆందోళన పడుతూనే ఉన్నారు.

ఈ మధ్యే ఒక సంఘటన జరిగింది. మా వాళ్ళు షాప్ ఓపెనింగ్ కి పిలిచారు. నాలుగు రోజుల నుంచి విపరీతమైన వర్షాలు పడుతున్నాయి. వాళ్ళందరూ ఆందోళన పడుతున్నారు. వర్షం వస్తే ఈ ప్రోగ్రాం ఎలాగా? అనుకుంటున్నారు. మరి ఆ ముందు రోజు కొంచెం తగ్గింది. ఆ రోజు పూర్తిగా తగ్గి విపరీతమైన ఎండ కాసేసింది. ఎండకాస్తే వీళ్ళందరూ ఎవరికి వాళ్ళు ఖాళీగా ఉండి భోజనాల దగ్గర అనుకుంటున్నారు. నేను ఇలా దణ్ణం

పెట్టేసుకున్నాను అందుకే ఎండ కాసింది అని. ఆ మాటలు వింటే నాకు నవ్వొచ్చింది.

నిజానికి ప్రకృతి ఎప్పుడూ సహజంగా దాని పని అది చేసుకుంటూనే ఉంటుంది. కానీ మీరు దణ్ణం పెట్టుకోవడం వల్ల అయ్యింది, మన వల్ల అయింది అని అజ్ఞానపు మానవులు అనుకుంటారు. వీళ్ళు దణ్ణం పెట్టుకున్నారు. కానీ మిగతా వాళ్ళు దణ్ణం పెట్టుకోలేదు కదా? అయినా వాళ్ళకి ఎండ వచ్చిందిగా! అంటే అంతవరకు ఆలోచించే మేధస్సు అజ్ఞానులకి ఉండదు. ఇది మనం అర్థం చేసుకుని నవ్వుకోవడమే తప్ప వాళ్ళకి నచ్చ చెప్పలేం.

కొందరైతే రాజ్యలక్ష్మి గారు ఎక్కువ ధ్యానం చేస్తారు కదా! అందుకే ఆవిడ ఓపెనింగ్ చేసినప్పుడు జనాలకి ఇబ్బంది రాకుండా ఎండ కాసింది అనుకున్నారు. నేను దీనికీ పొంగలేదు, దానికీ స్పందించలేదు, నవ్వుతూ చూస్తున్నాను. ప్రజల యొక్క మనస్తత్వం అలా ఉంటుంది. వెంటనే నేను అనొచ్చు. పోనీలెండి మీరు కూడా ధ్యానం చేయండి, మీరు ఎక్కడికి వెళ్ళినా బాగుంటుంది అని. కానీ నేనేం మాట్లాడలేదు, వాళ్ళ యొక్క భావాలకి నవ్వుకుంటూ ఉన్నాను, ఎందుకంటే నేచర్ చేయవలసింది చేస్తూ ఉంటుంది. దాన్ని అంగీకరించడమే మన పని. అప్పుడే నేచర్ ని గౌరవించినట్లు అవుతుంది.

ఇది ఇలా ఉంది, అది అలా ఉంది అని అనుకోకుండా ఉండ గలగాలి. మనకి ఆధ్యాత్మికత తెలుసు కాబట్టి నేచర్ ఎప్పుడూ, ఎవరినీ ఇబ్బంది పెట్టేటంత క్రూరత్వంతో ప్రవర్తించదు అని మనకు తెలుసు. అంటే ఇక్కడ ఆధ్యాత్మిక పరిజ్ఞానం ఉన్నవారి ఆలోచనా విధానానికి, ఆధ్యాత్మిక పరిజ్ఞానం లేని వారి యొక్క ఆలోచనా విధానానికి చాలా తేడా ఉంటుంది అని మనం గమనించాలి.

ఈ మార్గంలోకి వచ్చాక మన పని మనం చేయడమే కానీ నేచర్ని ఎప్పుడూ విమర్శించకూడదు అని మనం తెలుసుకుంటాం. ఆధ్యాత్మికత

ఉన్నవాడు నేచర్ ని గౌరవిస్తాడు. ఆధ్యాత్మికత లేకపోతే ప్రకృతిని గౌరవించలేరు. మరి ఇంకో కారణం ఏమిటంటే!

2) శరీరానికి సంబంధించిన బంధువుల వల్ల ఆధ్యాత్మికత తెలిసినా అందులో ఉండలేరు. మన చుట్టూ ఉన్న బంధువులందరూ కూడా ప్రాపంచిక స్థితిలో ఉన్నప్పుడు, ఆధ్యాత్మికం గురించి అంటే ఈ ధ్యానం, జ్ఞానం అనే జీవితం గురించి, దీని వైభోగం గురించి తెలిసినా, వాళ్ళ వల్ల మీరు ఒక్కొక్క సారి వెనక్కి వచ్చేస్తూ ఉంటారు. అంత శ్రద్ధగా చేయలేరు. ఒక స్థాయి వచ్చే వరకు మీరు చాలా శ్రద్ధగా ఉండాలి. ఎంతవరకు అంటే? ఎంతమందిలో ఉన్నా మీ దృష్టి చెదరనంతవరకూ మీరు దీన్నే ఎక్కువగా పట్టుకోవాలి. మీ దృష్టి చెదిరిపోతుంది అంటే సంఘటనలే కారణం అయిపోతాయి.

ఇప్పుడు బంధువులు అందరూ ప్రాపంచికంగా ఉన్నప్పుడు మీరు ధ్యానాన్ని అశ్రద్ధ చేస్తారు. కానీ అలా చేయకూడదు, ధ్యానం ధ్యానమే! ఎంతమందిలో ఉన్నా, ఎలా మాట్లాడినా మీ పని వచ్చేటప్పటికి చేసుకుంటూ ముందుకు వెళ్ళిపోతే పురోగమనం ఉంటుంది. కానీ ఇంకా వాళ్ళ గురించి ఆలోచించినప్పుడు మళ్ళీ వెనక్కి వస్తారు.

ఒకరు నమఃశివాయ అనే అక్షరాలు ఎలా వచ్చాయి అని నన్ను ప్రశ్న వేశారు. మరి ఇన్ని వందల మంది, వేల మంది ఉంటే నన్నే ఎందుకు ప్రశ్న వేశారు? అంటే అక్కడ వాళ్ళకి తెలియదు, మనకి తెలుసు అనే విషయం వాళ్ళకి అర్థమయ్యింది కాబట్టి. అంటే ఆధ్యాత్మికతలో ఉన్నవాళ్ళు అన్నిటికీ సమాధానం చెప్పగలరు అనే అభిప్రాయం వాళ్ళకు ఉంది.

అంటే వాళ్ళు ఇంకా రాలేదు కానీ మన మీద ఒక గౌరవం ఉంది. అంటే ఇప్పుడు మన జీవితం చూసి వాళ్ళకంటే ధ్యాన జీవితంలో ఉన్న మనమే ఒక మెట్టు పైనే ఉన్నాము అని వాళ్ళకి అర్థమవుతుంది. ఇప్పుడు ఈ స్థాయికి వచ్చాక మనం మెట్లు దిగం, వాళ్ళనే పై మెట్టుకి ఎక్కిస్తాం. ఆ స్థాయికి

వచ్చేవరకు మీరు నిరంతర కృషి చేస్తూనే వుండాలి, ఎప్పుడూ వెనక్కి వెళ్ళకూడదు.

మీ చుట్టూ వున్న పరిసరాలను బట్టి మీరు మారిపోవడం కాదు. మీ చుట్టూ వున్న పరిసరాలను కూడా మీరు మార్చగలిగే శక్తి మీరు పెంచుకోవాలి. కోటి లింగాల్లో ఒక లింగంలా బ్రతకడం కాదు. కోటి లింగాల్లో కూడా మనమే ప్రత్యేకమైన లింగం అవ్వాలి. అప్పుడు మీ చుట్టూ వున్న బంధువులు ఎంత ప్రాపంచికంగా ఉన్నా మీరు మాత్రం మారరు.

3) అలాగే పుట్టిన ఊరుని, మీ ఇంటిని, మీ పరిసరాల్ని పదే పదే తలుచుకోవడం వల్ల కూడా దృష్టి పెట్టలేరు. మా ఊరు ఇలాగా, మా ఇంట్లో ఇలా ఉంటాం, అలా ఉంటాం అని తలుచుకుంటారు. కొంతమంది పెళ్లి అయ్యి 50 ఏళ్ళయినా, 70 ఏళ్ళయినా ఇంకా చిన్నతనంలో జరిగిన విషయాలు, ఆ ఊరి విషయాలు, ఆ ఇంటి విషయాలు పదే పదే గుర్తు చేసుకుంటూ ఉంటారు. మరి బుద్ధుడు వర్తమానంలో జీవించండి అని చెప్పాడు. పదే పదే గతాన్ని తవ్వుకోవడం వల్ల వర్తమానంలో ఉన్న గొప్ప అవకాశాన్ని మీరు పోగొట్టుకుంటారు. అందుకే వర్తమానంలో నేను ఎంత సాధన చేయాలి? ఎంత జ్ఞానం పెంచుకోవాలి? అనే దాని మీద దృష్టి పెట్టండి.

అంతేకానీ జరిగిపోయినవి తలుచుకుంటూ, పది మందినీ పోగేసి, మీ కథను చరిత్రలా చెప్పడం కాదు. వర్తమానంలో ఈ ధ్యాన జీవితం ఎంత గొప్పగా ఉంది! ఇంకా ఎదగడానికి అవకాశం ఉంది అన్నది ఆలోచించాలి. ప్రాపంచిక జీవితంలో డబ్బు సంపాదించడానికి ఎన్నో అవకాశాలు ఉంటాయి, చచ్చే వరకు సంపాదిస్తారు.

అలాగే ఆధ్యాత్మిక జీవితంలో జ్ఞానం పెంచుకోవడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. మరి చచ్చే వరకు కూడా అవకాశాలు ఉంటూనే ఉంటాయి.

ఇది గ్రహించిన జ్ఞానులు ఆ గతాన్ని తలుచుకోకుండా వర్తమానంలో జ్ఞానాన్ని పెంచుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తారు. ఆ పాతవి తలుచుకోవడం వల్లే వర్తమానంలో ధ్యానం చేయలేకపోతారు.

4) భౌతిక శాస్త్రాలు ఎక్కువ చదివి వాటి మీద నమ్మకం పెంచుకుంటూ, ఆధ్యాత్మిక శాస్త్రం విలువ తెలియక భౌతిక శాస్త్రాలనే పదే పదే గుర్తు చేసుకోవడం వల్ల కూడా దృష్టి పెట్టలేరు. భౌతిక శాస్త్రాలు సృష్టిలో ఉండేవాటి వరకే చెప్తాయి, సృష్టికర్త గురించి చెప్పవు. సృష్టికర్త గురించి నేను చదవలేదు కాబట్టి లేవు అంటే మరి ధర్మం ఒప్పుకోదు. అందుకే భౌతిక శాస్త్రాలు చాలా ఎక్కువ అధ్యయనం చేసిన వారికి దాని తర్వాత ఈ శాస్త్రం ఇలా రాశారు కానీ, ఇంతకంటే వాళ్ళ మేధస్సుకు అందలేదు. మరి ఆ మేధస్సుకి అందనప్పుడు నేను ఇంతవరకే చదివాను, ఇదే కరెక్ట్, దేవుడు లేడు, నాకు కనబడట్లేదు కాబట్టి లేడు అంటే ఎలా?

గాలి కనబడదు. మరి గాలి కనబడదు కాబట్టి లేదని నువ్వు నమ్ముతావా? లేదని అనుకుంటావా? నువ్వు అనుభూతి పొందుతున్నావుగా? అలాగే కనబడనిది లేదు అనుకోవడం మూర్ఖత్వం. కనిపించేవి నువ్వు ఎన్నైనా గ్రహించగలవు కానీ కనబడనిది తెలుసుకోవడానికే నీ మేధస్సును పెంచుకోవాలి. ఆ మేధస్సును పెంచుకునే మార్గమే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం.

అందుకే భౌతిక శాస్త్రాల మీద నమ్మకం ఉంచుకుని ఆధ్యాత్మిక శాస్త్రం పై వ్యతిరేక భావాన్ని వ్యక్తపరచడం కరెక్ట్ కాదు. భౌతికమంతా అపరావిద్య, ఆధ్యాత్మికమంతా పరావిద్య. భౌతిక శాస్త్రం 50% మనం నేర్చుకున్నట్టు మిగతా 50% ఆధ్యాత్మిక శాస్త్రాలు చదివాలి. ఆధ్యాత్మిక శాస్త్రం చదవని వాడికి, పరావిద్య నేర్చుకోని వాడికి పరమాత్మ గురించి అర్థం కాదు.

ఒక విత్తనం మహావృక్షం అయింది అంటే భౌతిక శాస్త్రం చదివిన వాడు ఎండ వల్లా, నీటి వల్లా, నేల వల్లా అయ్యింది అనుకుంటాడు. కానీ ఈ

ఎండకి, నీటికి, భూమికి వాటి విధులు నిర్వర్తించడానికి కావలసిన శక్తి ఆ పరమాత్మ దగ్గర నుంచే వచ్చింది అని అర్థం చేసుకోవడమే ఆధ్యాత్మిక శాస్త్రం.

కనిపించే వాటన్నిటికీ కూడా కనిపించని పరమాత్మే శక్తిని ఇస్తున్నాడు అని ఎవరైతే తెలుసుకుంటారో వాళ్ళు యోగులుగా ఉంటారు, జ్ఞానులుగా ఉంటారు, బ్రహ్మగా ఎదుగుతారు, బ్రహ్మర్షులు అవుతారు. మరి భౌతిక శాస్త్రం చదివేవాళ్ళు సాధారణ వ్యక్తులుగా ఉంటారే కానీ యోగుల్ని గుర్తించే తెలివితేటలు కానీ, మేధస్సు కానీ వాళ్ళకి ఎప్పుడూ ఉండదు.

మరి శరీరం శాశ్వతం అనుకోవడం, మీ చుట్టూ ఉన్న చుట్టాలు బంధువులు శాశ్వతం అనుకోవడం, ఎప్పుడూ గతాన్ని తవ్వుకుంటూ ఉండడం, భౌతిక శాస్త్రాలు కరెక్ట్ అనుకుంటూ వాటిని అధ్యయనం చేసి, ఆధ్యాత్మిక శాస్త్రాలు చదవక నేను చూడంది లేదు అన్నదే అజ్ఞానం.

ఒక మర్రి చెట్టుకి ఊడలు వస్తే అవి కత్తిరించకపోతే భూమి వరకూ వెళ్లి అవే వేరులుగా మారిపోయి మళ్లీ ఇంకో చెట్టులా అయిపోతుంది. మరి దాన్ని ఎప్పటికప్పుడు నరుకుతూ ఉంటే అవి భూమిని తాకవు. ఆ విధంగానే మనకి ఇలాంటి అభిప్రాయాలన్నీ కూడా జన్మ జన్మల నుంచి వాసనలుగా రావడం వల్ల ఈ ప్రాపంచిక జీవితంలో ఇవే గొప్ప అనుకుంటూ అజ్ఞానంతో బ్రతికేస్తున్నాం. ఒకవేళ తెలిసినా మాయ కమ్మిన మానవుడు ముందుకు అడుగులు వెయ్యలేక వెనక్కే వుంటాడు.

మరి ఆ ఊడలు నరకడానికి ఒక శస్త్రం, ఒక అస్త్రం ఉండాలి. అలాగే మానవుడికి ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక జన్మలో వైరాగ్యం అనేది వస్తుంది. మరి వైరాగ్యం అనే అస్త్రంతోటే వీళ్ళ అభిప్రాయాలు పోతాయి.

వైరాగ్యం అంటే వదలడం కాదు. ప్రాపంచిక జీవితం జీవిస్తూ మూలం ఏమిటి? అని ప్రాపంచికాన్ని తగ్గించుకొని, ఎప్పుడూ ఆధ్యాత్మికంగా విచారణ చెయ్యడమే వైరాగ్యము అన్నారు. అంటే ఈ ఇల్లు, ఈ శరీరం, ఈ

బంధువులు శాశ్వతం అని అందరిలోనూ కొన్ని అభిప్రాయాలు ఉండిపోయాయి. కానీ దీనికి ఒకే ఒక్క మందు వైరాగ్యం అన్నారు.

అందుకే ఆధ్యాత్మిక జీవితంలో మీరు ఎదగాలి అనుకుంటే "దురహంకారం" అంటే మీకు అక్కర్లేని అహంకారం చాలా చాలా ఎక్కువ ఉంటుంది, అది పోగొట్టుకోవాలి. దుష్టులతో సాంగత్యం అంటే ఆధ్యాత్మికతని పోగొట్టే స్నేహితులని వదులుకోవడం మంచిది కానీ, ఆధ్యాత్మికతను వదులుకోవడం మంచిది కాదు. అలాగే "మాయని జయించాలి". మరి ధ్యానం చేస్తున్నా ఇంకా ప్రాపంచిక కోరికలు ఉన్నాయి అంటే ఇంకా మీరు మాయకి వశమవుతున్నారు అని గుర్తు పెట్టుకోవాలి.

మీకు ఇప్పుడు కొన్ని బాధ్యతలు ఉంటే, బాధ్యత తీరగానే మళ్ళీ ధ్యానంలోకి రాగలగాలి. అంతే కానీ బాధ్యతల్లో ఇంకా ఇంకా కూరుకుపోతూ ధ్యానము, జ్ఞానము వదిలితే ఎన్ని వందల జన్మలైనా దుఃఖంలోనే వుంటారు. కానీ ఎప్పటికీ అమరత్వ జీవితంలోకి వెళ్ళలేరు. మరి అమరత్వం పొందాలి అంటే ఒక్క మానవ జన్మలోనే సాధ్యం.

మరి మానవ జన్మ తీసుకున్నా ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నవాళ్ళే ఈ అమరత్వం పొందగలరు, లేకపోతే పొందలేరు. అందుకే సత్యం తెలుసుకున్నా, ధ్యానం యొక్క విలువ, గొప్పతనం తెలుసుకున్నా వెనక్కి వెళ్ళిపోవడానికి కారణం ప్రాపంచికమైన కోరికలే.

మరి మీ అందరూ ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితికి ఎదగాలి అని కోరుకుంటున్నారు కానీ ప్రాపంచికంలో కష్టం వచ్చినా పోవాలి అనుకోవట్లేదు, బాధలు వచ్చినా పోవాలి అనుకోవట్లేదు. ఇంకా ఏదో కావాలి అని కూడా అనుకోవట్లేదు. అంటే ఈ స్థితిలో మీరు సత్యాన్ని గ్రహించారు కాబట్టే సత్యంలో జీవిస్తూ ఆనందాన్ని పొందుతున్నారు.

మరి మీ జీవితంలో దుఃఖం శాశ్వతంగా పోవాలి అంటే ఆధ్యాత్మిక

జీవితమే జీవించాలని మీకు అర్థమవుతుంది. అందుకే అమరత్వ జీవితానికి అసలైన పునాది ఆధ్యాత్మిక జీవితమే అని మహాత్ములు చెప్పారు. కాబట్టి ప్రతీదీ విచారణ చేస్తూ, ప్రాపంచిక జీవితంలో ఎవరినీ నొప్పించకుండా, వివేకంతో లౌక్యంగా, సమర్థవంతంగా జీవిస్తూ ముందుకి వెళ్ళాలి.

అందుకే ఒక జ్ఞాని ప్రాపంచిక జీవితంలోనూ గొప్పగా జీవిస్తాడు, ఆధ్యాత్మిక జీవితంలోనూ గొప్పగా జీవిస్తాడు. మరి ఆధ్యాత్మికంలో జీవిస్తున్నాము కదా ప్రాపంచికం వద్దు అనడం అజ్ఞానమే, అలాగే ప్రాపంచిక జీవితం జీవిస్తూ ఆధ్యాత్మికం నాకు అవసరం లేదు అనుకోవడమూ అజ్ఞానమే. కాబట్టి రెండిటిని సమస్థితిలో బ్యాలెన్స్ చేసుకుంటూ చాలా ఆనందకరమైన జీవితం జీవించడమే గొప్ప జీవితం, అదే అమరత్వ జీవితం.


## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

website address : www.tst.org.in

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

# సత్యానుభూతి కలగకపోవడానికి కారణం!

సత్య దర్శనం చేసే ప్రతీ వాళ్ళు వాళ్ళ అనుభూతులని అందరకూ పంచుతూ.. ఏ రకంగా మీరు సత్యాన్ని తెలుసుకోవచ్చు అనే విషయం మీరు తెలియపరుస్తారు. అందుకే పత్రి గారు ఎప్పుడూ కూడా స్వాధ్యాయం చేసి సత్యం ఎలా అనుభూతి పొందవచ్చో చెప్తూ ఉండేవారు. ఆ సత్యాన్ని చేరుకునే ప్రయత్నంలో ఉన్న మీరు ఎలా ముందుకు వెళ్ళాలి అన్నది మీకు తెలుస్తుందనే పత్రి గారు మీ చేత స్వాధ్యాయం చేయించేవారు.

అలా ఎందరో ఆత్మ దర్శనం చేసిన వారి యొక్క అనుభవాల నుంచి మీరు ఎన్నో విషయాలు తెలుసుకుంటే మీ ప్రయాణం ఇంకా తేలిగ్గా ఉంటుంది. అందుకే మీరు ప్రతి ఒక్కరి గురించి అధ్యయనం చేయాలి. రమణ భగవాన్ సత్యం గురించి ఏమన్నారో తెలుసుకుందాం. ఆయన  సత్యం ఎప్పుడూ ఉండేది అన్నారు.

ముందు మీరు "నిజానికి", "సత్యానికి" వున్న తేడా ఏమిటో తెలుసుకుందాం.

'నిజం' అంటే వర్తమానంలో వున్నది క్షణం దాటితే మారి పోతూ ఉంటుంది. కానీ సత్యం అన్నది అన్ని కాలాలలోనూ, అన్ని యుగాలలోనూ మార్పు చెందకుండా ఉంటుంది. సత్యం అంటే ఎప్పటికీ మార్పు చెందనిది. ఇప్పుడు ఉండి తర్వాత లేకుండా ఉండడం కానీ, ఇప్పుడు ఇలా ఉండి తర్వాత ఇంకొక రకంగా వుండం కానీ వుండదు.

ఉదాహరణకి ఇప్పుడు ఈరోజు మీరు ఒక మామిడి చెట్టుని చూసినప్పుడు ముందు దానికి ఒక పువ్వు వస్తుంది, తర్వాత కొన్ని రోజులకి పిందెగా, తర్వాత  కాయగా, తర్వాత పండుగా మారుతుంది. అది నిజం అంటే మార్పు చెందింది కాబట్టి.

కానీ ఇక్కడ సత్యం అన్నది ఎప్పటికీ మార్పు చెందనిది. ఇలా మార్పు

చెందకుండా, మరుగవ్వకుండా, ఒకప్పుడు ఉండి ఒకప్పుడు లేకుండా ఉండేది ఏదైతే ఉందో అదే సత్యం. మరుగయ్యేది ఏదీ సత్యం కాదు. మరుగైతే అది సత్యమే కాదు అని రమణ భగవానుడు చెప్పడం జరిగింది.

అయితే ప్రతీవారు సత్యాన్ని తెలుసుకోవడానికే మానవ జన్మ తీసుకుంటారు. మానవ జన్మ పరమార్థమే అది. మరి సత్యాన్ని తెలుసుకోవడానికి, సత్యంలో జీవించడానికి వచ్చిన మానవులు ఎందువల్ల ఆ సత్యం వైపు తిరగలేకపోతున్నారు? సత్యంలో జీవించలేకపోతున్నారు? అంటే రమణ భగవాన్ భోగాశక్తి వల్ల అన్నారు.

భోగాశక్తి అంటే ప్రపంచంలో ఈ బాహ్యామైన కళ్ళతో చూస్తున్న ప్రతీదీ కూడా మన సొంతమైతే బాగుండును అనే ఒక ఆసక్తి. ఆ భోగాశక్తి ఉన్నంతసేపు సత్యాన్ని తెలుసుకోవాలని అనిపించదు. ఇప్పుడు ప్రపంచంలోనివి కావాలనుకుంటే భోగం, మరి కళ్ళు మూసుకుని మీలోకి మీరు అంతర్ ప్రయాణం చేస్తే యోగం. మరి ఎవరికి ఈ భోగకాంక్ష ఎక్కువగా ఉంటుందో వాళ్ళు సత్యం గురించే ఆలోచించరట.

ఇప్పుడున్న ప్రపంచం అంతా ఇలాగే ఉంది. ఇలాగే కనబడుతుంది. ప్రతీ వాళ్ళకీ ఎంతసేపూ అనుభవిద్దాం అనే ఉంటుంది. ఇతరులకి ఏమైనా ఉంటే చూసి వెంటనే నాకు కూడా ఉంటే బాగుండును అని అనుకుంటారు. ఒక్కొక్కళ్ళు అనుకుని వదిలితే కొందరు దాని గురించి ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఆ ప్రయత్నం చేసినప్పుడు ఒక్కొక్కసారి పొందొవచ్చు, పొందకపోవచ్చు. పొందినప్పుడు సంతోషపడుతూ, పొందనప్పుడు దుఃఖపడుతూ ఉంటారు.

పోనీ ఆ ఒక్క వస్తువు సొంతం చేసుకొని సంతోషంతో ఊరుకుంటారా? ఆ తర్వాత ఇంకా ఇంకా కోరికల్ని పెంచుకుంటూనే ఉంటారు. ఇలా ఇతరుల అనుభవాలని చూస్తూ, ఇతరుల సంపదలను చూస్తూ అవన్నీ

మనకీ ఉండాలనే ఆశ, ఆసక్తిని పెంచుకోవడమే భోగాసక్తి.

ఎప్పుడైతే వాటిపైన అంత తీవ్రంగా మీకు ఆసక్తి ఉంటుందో మీరు ఇక యోగంలోకి వెళ్ళడానికి ఆసక్తిని చూపించరు. మరి ఈ స్థితిలో ఉన్నప్పుడు ఎప్పటికీ వాళ్ళకి ఈ కోరికలే ఉంటాయి. కొంతమందికి గురువులు వచ్చే వరకు ఈ ఆసక్తులు ఉన్నా, ఎక్కడో వాళ్ళ సత్కర్మల వల్లో, లేకపోతే వాళ్ళకున్న సత్వగుణం వల్లో గురువు రాగానే సత్యం తెలుసుకుని మారతారు.

మరి తెలుసుకున్న ప్రతీవారూ చేయలేరు. ఇప్పుడు ధ్యానం గొప్పది అని అందరూ తెలుసుకుంటున్నారు కానీ ఆ ధ్యానం కూడా సత్యాన్ని తెలుసుకోవడానికే అని చాలా కొద్దిమందికి మాత్రమే అర్థమవుతుంది.

ఎందుకంటే ఇప్పుడు ఉన్న పరిస్థితులను బట్టి చాలా మంది మాస్టర్లు ధ్యానం అంటే ఆరోగ్యం కోసం, ధ్యానం అంటే సంకల్పాలు నెరవేర్చుకోవడం కోసం, ధ్యానం అంటే సమస్య నుంచి బయటపడటం కోసం అని చెప్తున్నారు. కానీ ప్రాపంచికంగా ఇవన్నీ కూడా ఒకదాని తర్వాత ఒకటి వస్తూనే ఉంటాయి. ఎందుకు వస్తున్నాయి? అంటే కర్మల వల్ల వస్తున్నాయి. ఆ కర్మలు అనేవి ఒక్కసారిగా ఎవ్వరు తొలగించలేరు.

కర్మలే పోతే రోగాలు, బాధలు అనేవి ఉండవు అనే సత్యం తెలుసుకున్న రోజున, ఆ కర్మలని పోగొట్టుకునే మార్గం ధ్యానము అని అర్థమవుతుంది. ధ్యానం ఎందుకంటే సత్యాన్వేషణ కోసం. సత్యాన్వేషణ అంటే సత్యాన్ని తెలుసుకోవాలనే తపన. మరి దానికోసమే ధ్యానం.

ఎంతవరకు సత్యాన్వేషణలో ఉండరో, అంటే సత్యాన్ని తెలుసుకోనే మార్గంలో ఉండరో, వాళ్లకి ఖచ్చితంగా ప్రాపంచిక ఆకర్షణ, శరీరం నేననే భావన పోలేదు అని అర్థం చేసుకోవాలి. రమణ భగవాన్ ఇంకా ఏమంటారంటే? ఎప్పుడైతే ధ్యానం గురించి మీకు గురువు వచ్చి చెప్తాడో నిత్యము సత్సంగంలో పాల్గోవాలి అన్నారు.

సత్సంగం అంటే చాలామంది జనసమూహం అనుకుంటారు. కానీ కాదు. సత్సంగం అంటే సత్యంతో సంగమించి ఉండడం. సత్యం అంటే దైవం. మీలో ఉన్న ఆత్మే దైవం అని తెలుసుకున్నవారు, సత్యం అంటే ఎల్లకాలాల్లోనూ ఉండేది. ఆ దైవం మీలో ఆత్మగా ఉన్నాడు కాబట్టి, అదే సత్యం కాబట్టి, ఆ సత్యంతో నిత్యమూ సంగమించి ఉంటే, అంటే ధ్యానం చేస్తే, అప్పుడు సత్యాన్ని తెలుసుకోగలరు అని చెప్పడం జరిగింది.

అందుకే ధ్యానం అన్నది ఒకరోజు చేసి ఒకరోజు వదలడం కాదు. మీరు ఆత్మ గురించి అంటే భగవంతుడు గురించి ఎంతగా తపన పడుతున్నారో ఆ భావం భగవంతుడికి అర్థమవ్వాలి. మరి మీరు ఒకరోజు చేసి, ఒకరోజు ఆపుతున్నారు అంటే మీకు భగవంతుడి మీద ఆసక్తి లేనట్టే. ఆసక్తి ఉంటే మీ అన్వేషణ రోజు రోజుకీ తీవ్రమవ్వాలి కానీ ఖాళీ ఉన్నప్పుడు ధ్యానం చేస్తాను, ఖాళీ లేకపోతే చేయను, నాకు వీలవ్వలేదు అని కూర్చుంటే నీకు సత్య దర్శనం జరిగేది ఎప్పుడు?

అందుకే భగవంతుని గురించి ఎంతగా అవగాహన చేసుకుంటారో అంతగా మీరు ఆ అనుభూతి పొందుతారు. ఇదేదో ఆకారం రూపంలో కనబడదండి అన్నది ఒక అనుభూతి. ఆ అనుభూతి మీరు పొందాలి అంటే ముందు గురువు ద్వారా ఈ మాటలు వినాలి. ఏంటి? అంటే పువ్వులకి సుగంధం ఎంత స్వత సిద్ధంగా ఉందో, ప్రతి జీవిలోని ఆత్మనే భగవంతుడు ఉన్నాడు. అంటే పువ్వులకు సుగంధం సహజగుణం, అలాగే జీవులలో పరమాత్మ ఉండడం  సహజం.

అంటే భగవంతుడు లేని జీవులు లేవు. భగవంతుడు లేని సృష్టి లేదు అని మీకు ఎంతగా అవగాహన అవుతుందో అంతగా మీకు సత్యం మీద ఆసక్తి, భగవంతుడి మీద ఆసక్తి పెరుగుతుంది అని రమణ భగవానుడు అంటారు. మరి ఈ సృష్టి అంతా పరమాత్మది అనే భావంతో ఉన్నప్పుడు

మీలో అహంకారం, మమకారం రెండూ పోతాయి.

ఎందుకంటే నాది నాది అనుకున్నప్పుడు అహంకారం పెరుగుతూ ఉంటుంది. నా వాళ్ళు అనుకున్నప్పుడు మమకారం పెరుగుతూ ఉంటుంది. అంటే వారు ఎంతసేపూ శరీర దృష్టిలో, ప్రపంచ దృష్టిలో ఉంటున్నారు.

మరి ఈ అహంకారం, మమకారం రెండూ వదలాలి అంటే ఇదంతా భగవంతుడిదే, భగవంతుడు లేనిదీ, కానిదీ ఏదీ లేదు అని నిరంతరము మీకు ఎరుక ఉండాలి. ఈ సృష్టి అంతా ఉన్న భగవంతుడు అణు మాత్రంగా నాలో ఆత్మగా ఉన్నాడు ఆ అనుభూతి పొందే మార్గం అంతర్ ప్రయాణమే అని మీరు ఎంతవరకు తెలుసుకోరో అంతవరకు ఈ బాధలూ, కష్టాలూ, కన్నీళ్లూ తప్పవు, అవి మీ వెనకాలే వస్తాయి.

అంటే ఇక్కడ భగవంతుడు కూడా మానవ జన్మని సృష్టించి, భగవంతుని తెలుసుకునే అర్హత ఒక్క మానవ జన్మకే ఇచ్చాడు. ఎంతవరకు ఆ పరమాత్మని తెలుసుకోరో! అంతవరకూ కర్మల వలయంలో చిక్కుకునే ఉంటారు. కర్మలు ఎంతవరకు ఉన్నాయో మీకు మీరే తెలుసుకోవచ్చు.

మీ జీవితంలో బాధలకి, రోగాలకి, కష్టాలకి కారణం మీ కర్మలే అని కర్మ సిద్ధాంతం ద్వారా తెలియపరిచిన భగవంతుడు ఆ కర్మలను పోగొట్టుకునే మార్గం కూడా ఆ గురువు ద్వారా తెలియపరిచాడు. మరి ధ్యానం ద్వారా లోపల ఉన్న ఆత్మ అనే భగవంతుని దర్శించే వరకు మీకు కర్మలు ఉంటాయి. ఆ ఆత్మ అనే భగవంతుని ఎప్పుడైతే దర్శిస్తారో అప్పుడు కర్మలన్నీ భస్మం అవుతాయి. అంటే భగవంతుడు అణువణువున ఉన్నాడు అని అంటున్నాం కానీ అనుభూతి చెందట్లేదు. అంటే ఆ ఎరుకని కోల్పోయి ప్రవర్తిస్తున్నారు.

ఇది భగవంతుడు వల్ల చేస్తున్నాను అని అంటున్నారు కానీ, మీరు అలా సహజంగా జీవించట్లేదు. సహజంగా జీవించడం అంటే ఎప్పుడూ నేను

అనే పదం, ఈ మేనుకు ఉపయోగించకుండా నాలో ఉన్న పరమాత్మే చేయిస్తున్నాడు, ఈ శరీరం అనే పనిముట్టుతోటి ఈ పనులు జరిపిస్తున్నాడు, కానీ ఈ పనిముట్టు ఏమీ చేయదు, ఇందులో వున్న ఆత్మ అనే సత్యం తప్పుకున్న రోజున ఈ శరీరం ఏమీ చేయలేదు అని మీరు వివేకం వల్ల తెలుసుకోవాలి.

తెలుసుకుంటున్నారు కానీ ఆచరణలోకి వచ్చేటప్పటికి ఈ ఎరుకని కోల్పోతున్నారు. నిరంతరం ఎరుకతో జీవించినప్పుడే మీరు సత్యంలో జీవించినట్టు అన్నారు.. నిరంతర ఎరుక అంటే మీరు ఏ పనైనా చేయ గలుగుతున్నారు అంటే మీలో ఆత్మ వల్లే అనే ఎరుక ఉండాలి. ఆ తర్వాత ఈ శరీరం ఒక పని ముట్టే కానీ ఆత్మ నేనై ఉన్నాను అంటారు. అంటే మీకు సాధన పెరిగే కొద్దీ, జ్ఞానం పెరిగే కొద్దీ ఆ అనుభూతిని పొందుతారు.

అయితే మీరు ఎంత ప్రయత్నించినా బాహ్య ప్రపంచంలో సత్ప్రవర్తన లేకపోతే ఆత్మానుభూతి పొందలేరు అని భగవాన్ చెప్పడం జరిగింది. అంటే ఈ సత్ప్రవర్తన ఉన్నవాడే సత్యాన్ని శోధించగలరు, సాధించగలరు, అనుభూతి పొందగలరు. ఇప్పుడు ఒక మనిషికి సత్ప్రవర్తన లేకపోవడానికి కారణం మనసే.

మనసు ఏం చేస్తుంది? అంటే మీరు ఆత్మ మార్గంలో ఉన్నా సరే బాహ్యంగా తిరిగిన మనసు అన్నిటిని కూడా స్వార్థపూరితం చేస్తుంది, కోరికలని పెంచుతూ ఉంటుంది. మీకు సత్యం గురించి అవగతం కానంతసేపు మీ కోరికలు పెంచుకోవచ్చు.

కానీ సత్యం గురించి తెలుసుకునే ఈ మార్గంలో ఉన్నప్పుడు గురువు చెప్పిన బోధ వల్ల మీకు అర్థమవ్వాలి. ఏమని?

ఈ సృష్టిలో ప్రతీదీ జరిపించబడుతుందే కానీ నేనేమీ చేయట్లేదు అని. కానీ నేను చేస్తున్నాను అనే అహంకారం, ఇది నాది అనే అహంకారం వుంటుంది. ఈ రెండు మీకు ఏ మాత్రం ఉన్నా, ఇంకా చెప్పుకోవాలంటే

ఇసకరేణువంత ఉన్నా ఆత్మ దర్శనం పొందలేరు.

మీరు ముందు లేదనుకుంటారు తర్వాత ఇవన్నీ తెలుసుకున్నప్పుడు నిజమే కదా నాలో ఇంకా అహంకారం ఉందేమో! మమకారం ఉందేమో! అందుకే నేను సత్యానుభూతిని పొందలేకపోతున్నాను అని అనుకుంటారు.

అక్కడ సత్ప్రవర్తన అన్న ఒక మాట వాడారు. సత్ అంటే భగవంతుడు. సత్ప్రవర్తన అంటే ఆ భగవంతుడికి నచ్చే ప్రవర్తన. కానీ భగవంతునికి నచ్చని ప్రవర్తన మీకు ఉంది అంటే మీరు ఇంకా మనోస్థితిలో ఉన్నారు. భగవంతుడికి నచ్చే ప్రవర్తన ఉంది అంటే మీరు సత్ప్రవర్తనలోకి వచ్చేసినట్లే.

మీరు సత్ప్రవర్తనలోకి వచ్చారు అని అనుకుంటారు కానీ ఆయన దర్శనం కలగట్లేదు అంటే ఇంకా రాలేదని మీరు అర్థం చేసుకోవాలి. మరి నేను ఇంకా ఏం మార్చుకోవాలి? నా మాట మార్చుకోవాలా? వినడం మార్చుకోవాలా? నా చూపు తేడా ఉందా? నా భావాలు తేడా ఉన్నాయా? నేను ఇంకా స్వార్థ బుద్ధితో ప్రయత్నిస్తున్నానా? ఇలా రకరకాలుగా మీరు విచారణ చేయాలి.

మీ పంచేంద్రియాలు ఎలా పని చేస్తున్నాయో నిత్యము మీరు విచారణ చేయాల్సిందే. అందుకే ఆయన విచారణ విచారణ అనే పదం ఎక్కువ వాడుతూ ఉంటారు. అందుకే వశిష్టుల వారు విచారణే పరమజ్ఞానం అని కూడా చెప్పడం జరిగింది. సత్ప్రవర్తన ఉంటేనే సత్యాన్ని అవగతం చేసుకోగలరు, సత్యాన్ని అనుభూతి పొందగలరు. దాని మార్గమే సత్సాంగత్యం.

మరి సత్యానుభూతి కలగాలి, అంటే ఆత్మ దర్శనం కలగాలి అంటే నిత్యము సత్సంగం చెయ్యాలి అంటే నిత్యము ధ్యానం చెయ్యాలి, రెండు మీరు చేసే ధ్యానం చక్కగా కుదరాలి అంటే సత్ప్రవర్తన ఉండాలి.

మీరు సత్తుతో సంగమించి ఉండాలంటే మధ్యలో ఈ ఆలోచనలు,

కోరికలు ఇవన్నీ వస్తూ ఉంటాయి. ఆ ఆలోచనలు ఎందుకు వస్తాయి? అంటే మనసు బాహ్యంలో తిరిగి వచ్చి అన్నిటినీ ఆలోచన రూపంలో చిత్తంలో నిక్షిప్తం చేసింది కాబట్టి. వద్దు అనుకుంటే మీకు మళ్లీ గుర్తురాదు. కావాలి బాగుంది అని అనుకుంటే చిత్తంలో నిక్షప్తం అవుతాయి. కానీ అది మీకు అనవసరం.

ఇప్పుడు మీరు రైల్వే స్టేషన్‌కి వెళ్తారు, ఎంతో మందిని చూస్తూ ఉంటారు. అక్కడికి చాలామంది వస్తూ ఉంటారు, వెళ్తూ ఉంటారు, ట్రైన్ ఎక్కుతూ ఉంటారు, దిగుతూ ఉంటారు. వాళ్ళెవరూ మీకు గుర్తురారు. కానీ మన దగ్గర కూర్చుని, మనతో మాట్లాడి, వాళ్ళ గురించి మనకు చెప్పి, మన గురించి వాళ్ళు అడిగి ఇలా పరిచయం అయినప్పుడు ఆ రోజు సాయంత్రం మీరు ధ్యానంలో కూర్చుంటే వారు, వారి మాటలే గుర్తు వస్తాయి. ఎందుకు వస్తున్నాయి? అవి మీరు లోనికి స్వీకరించారు కాబట్టి.

అక్కడ చుట్టూ తిరుగుతున్న జనాల్ని మీరు స్వీకరించలేదు. అందుకే వాళ్ళు గుర్తు రావట్లేదు.. కొన్నిసార్లు ఆ ముఖాలు కూడా గుర్తుకురావు. అంటే ఏదైనా స్వీకరిస్తే చిత్తంలో చింతనగా మిగులుతుంది. అదే మీరు స్వీకరించకుండా ఉండగలిగితే చిత్తంలో చేరి ఇబ్బంది పెట్టవు.

ఆ స్వీకరించే గుణం ఉంటే.. అంటే చూసిన ప్రతి వాళ్ళని లోపల వేసుకునే గుణం ఉంటే మీరు సత్యానికి దూరమవుతారు. అందుకే సత్ప్రవర్తన ఉండాలి. అంటే మీరు వాడికి ఏదైనా ఉపయోగపడే మాటలు చెప్పినప్పుడు, చెప్పాను అనే ఒక తృప్తి మీకు ఉన్నప్పుడు ఇబ్బంది పెట్టదు. అదే వాడి కష్టాలు, వాడి విషయాలు మీరు లోపల వేసుకుంటే మళ్ళీ ఇబ్బందే.

అందుకే సత్యాన్ని అవగతం చేసుకున్నవాడు, సత్ప్రవర్తనలో ఉన్నవాడు ఏ జ్ఞాపకాలనీ మనసులో పోగెయ్యరు. మీరు ఎవరినైనా తిట్టినా, ఎవరు మిమ్మల్ని తిట్టినా వాళ్ళు ధ్యానంలో గుర్తొస్తారు.

అదే మీరు ఎవరికైనా ఏదైనా సహాయం చేసినా, లేదా ఎవరికైనా ధ్యానం నేర్పించినా, ఎక్కడైనా క్లాస్ చెప్పినా, మాంసం మానేయమని చెప్పినా,

ఇలాంటివన్నీ చేసి ఇంటికి వచ్చి ధ్యానంలో కూర్చుంటే అక్కడ 100 మంది గుర్తుండరు. గమనించుకోండి. ఎందుకు గుర్తుండరు? వాళ్ళందరికీ నువ్వు మంచి చేసి వచ్చావు. ఆత్మ స్థితిలో ఉన్నవాడికి ఎప్పుడూ వర్తమానమే! గతమూ లేదూ, భవిష్యత్తూ లేదూ.

కానీ మనోస్థితిలో ఉన్నవాడికి గతమూ ఉంది, భవిష్యత్తూ ఉంది. కానీ వర్తమానంలో నుంచి వెళ్ళిపోయి గతాన్ని గుర్తు చేసుకుంటాడు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో అని భయపడతాడు.

అందుకే మీరు క్లాసు కి వెళ్ళినప్పుడు చెప్పిన సబ్జెక్ట్ కానీ, అక్కడున్న జనాల ముఖాలు కానీ వారికి ధ్యానంలో గుర్తుకు రావు. ఎందుకంటే ఆత్మ స్థితిలో ఏ పని చేసినా అక్కడ మనకి ఏ జ్ఞాపకాలు ఉండవు. కానీ వాళ్ళు కప్పిన శాలువా గుర్తొస్తుంది, ఎంతమంది ఫోటోలు తీయించుకున్నారో గుర్తొస్తుంది. ఎందుకంటే అది మనోస్థితి. ఆత్మకు ఎప్పుడూ వర్తమానమే. మనసు ఎప్పుడూ గతానికి కానీ, భవిష్యత్తుకి కానీ వెళ్ళిపోయి చిత్తంలో ఆ జ్ఞాపకాలని నిక్షిప్తం చేసుకుని ధ్యానంలో ఇబ్బంది పెడుతూ ఉంటుంది. ఆ జ్ఞాపకాలు ఉంచుకోవడం సత్ప్రవర్తన కాదు.

అందుకే ఆత్మానుభూతి పొందాలి, సత్యాన్ని తెలుసుకోవాలి అనుకున్నప్పుడు నిత్యము సత్సంగము చెయ్యాలి అంటే సత్యంతో సంగమించి ఉండాలి అంటే నిత్యము ధ్యానం చెయ్యాలి.

మరి బాహ్యంలో కళ్ళు తెరిచి ఉన్నప్పుడు సత్ప్రవర్తన అంటే ఆత్మకి తృప్తి కలిగే ప్రవర్తనతో ఉండాలి. అంటే ప్రేమ తత్వం, త్యాగం, సేవ, ఇవన్నీ మీకు ఎదగడానికి ఆత్మ తృప్తి కలిగే విషయాలు.

"అందుకే బాహ్యంలో సత్ప్రవర్తన, అంతరంలో సత్సంగము ఈ రెండు ఉన్నప్పుడు సత్యానుభూతి పొందడానికి అవకాశం ఉంటుంది అని రమణ భగవాన్ చెప్పడం జరిగింది".

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 9) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 10) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 11)పంచకోశాలు | - | రూ.60/- |
| 12) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 13) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 14) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్:9440309812,



## Tatavarthy Raghavarao Sir Books in English

| | | |
|---|---|---|
| 1. | Life Science (Part-I) | Rs.120 |
| 2. | Why is Guiding Not Meditation ? | Rs.100 |
| 3. | Which is the right Meditation ? | Rs.100 |
| 4. | Die before death! | Rs.120 |
| 5. | The Law of Karma | Rs.100 |
| 6. | What is Meditation? | Rs.80 |
| 7. | True Path | Rs.80 |
| 8. | Why soul-knowledge | Rs.70 |
| 9. | What comes after death ? | Rs.70 |
| 10. | How to improve Financial Status ? | Rs.60 |
| 11. | Wisdom is attained only through Meditation | Rs.60 |
| 12. | What is Intention? | Rs.50 |
| 13. | Why is this life? | Rs.50 |
| 14. | Vegetarian Food Is Human Food | Rs.50 |
| 15. | Meditation for the Development of Students | Rs.40 |
| 16. | Non violence and vegetarianism | Rs.40 |

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం -రూ.160/-
9) మరణించకముందే మరణించాలి - రూ.130/-
10) జీవిత సూక్ష్మాలు - రూ.130/-
11) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
12) గీతాసందేశం - రూ.120/-
13) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) కర్మ సిద్ధాంతం - రూ.80/-
21) ధ్యానమంటే ? - రూ.80/-
22) త్రివిధాలు - రూ.80/-
23) ఉత్తమ పురుషుడు - రూ.80/-
24) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
25) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
26) జ్ఞాన జ్యోతి - రూ.70/-
27) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
28) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
29) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
30) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
31) బుద్ధుని సందేశాలు - రూ.70/-
32) భూతదయే దైవత్వం - రూ.70/-
33) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
34) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
35) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
36) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
37) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
38) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
39) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
40) అతీంద్రియ శక్తులు - రూ.60/-
41) ఆలోచించండి - రూ.60/-
42) నిర్వాణ మార్గం - రూ.60/-
43) ధ్యానులకు సూచనలు - రూ.60/-
44) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
45) సంకల్పమంటే? - రూ.50/-
46) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
47) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
48) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.40/-
49) ఛాంపియన్ అవ్వాలంటే? -రూ.40/-
50) బ్రహ్మం అంటే? -రూ.40/-
51) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం -రూ.40/-
52) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం -రూ.40/-
53) మహాత్ముల సందేశాలు - రూ.40/-
54) సత్యం - రూ.40/-
55) చక్రాలు - రూ.40/-
56) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
57) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
58) మౌన ధ్యానం - రూ.40/-
59) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
60) శాకాహారమే మానవాహారం - రూ.15/-
61) అహింస మరియు శాఖాహారం- రూ.15/-

పుస్తకముల కొరకు : తటవర్తి వీర రాఘవరావు, తటవర్తివారి వీధి,
భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్: 9440309812,



అవిద్య అంటే తప్పుడు జ్ఞానం అంటే ఉన్నదాన్ని సరిగ్గా అవగాహన చేసుకోలేకపోవడం, అపార్థం చేసుకోవడం. అవిద్య వల్ల ఏదైనా విషయంపై సరైన అవగాహన లేనప్పుడు, అపార్థం చేసుకున్నప్పుడు దుఃఖం వస్తుంది. అవిద్య వల్ల తాహతుకు మించి కోరికలు, దాని వల్ల దుఃఖం వుంటుంది.

బ్రహ్మ విద్య అంటే బ్రహ్మము గురించి తెలియజేసే విద్య. విద్య అంటే జ్ఞానము. మరి బ్రహ్మము గురించి తెలిపే విద్యని పరావిద్య అని, ప్రాపంచిక విద్యని అపరావిద్య అని చెప్పడం జరిగింది.

నువ్వు సుఖంగా ఉండాలంటే ఎదుటి వాళ్ళ సుఖం కోరుకోవాలి, నువ్వు హాయిగా బ్రతకాలంటే ఎదుటివారిని హాయిగా బ్రతక నివ్వాలి, నువ్వు సంతోషంగా ఉండాలి అంటే ఎదుటివారి సంతోషానికి నువ్వు సహకరించాలి. అపవిత్రత, అవినీతి, దుర్గుణాలు ఉన్నన్నాళ్ళు ఆనందంగా జీవించలేరు. ఈ మూడు తొలగాలంటే ధ్యానం, స్వాధ్యాయం కూడా చేయాలి. సుఖము, సంతోషము, చక్కని జీవితం కావాలంటే ఈ భూమి మీద ఏ గుణాలైతే అలవాటుగా మారాయో, అవన్నీ ధ్యానంతో తొలగించుకోవాలి.

నిత్యం మన శరీరానికి ఆహారం ఎలా అవసరమో అలాగే ఆత్మకి ఆ ప్రాణ శక్తి అంత అవసరం. ఆత్మజ్ఞానికి భూమిమీద ఉన్నన్నాళ్ళు సాధన, జ్ఞానం రెండూ అవసరమే అని తెలుసుకోవాలి.

**- బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి**

రూ.70/-